RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY  తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 2 | సంచిక : 321 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం, జూన్, 11, 2025 | పేజీలు : 8  వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 2 | ISSUE NO : 321 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, June,11,2025 | PAGES : 8  RS : 4 /- |




## భారతదేశ జనాభా 146 కోట్లు..!

### తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు..

**న్యూఢిల్లీ,జూన్, 10:** 2025 నాటికి భారత దేశ జనాభా 1.46 బిలియన్లకు (146 కోట్లు) కు చేరుకుందని ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనాభా నివేదిక పేర్కొంది. అయితే, దేశంలో సంతానోత్పత్తి రేటు రీప్లేస్‌మెంట్ రేటు కన్నా తగ్గుతోందని వెల్లడించింది. యొక్క 2025 స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ని వేదిక, దిరియల్ ఫెర్టిలిటీ క్రైసిస్, సంతా నోత్పత్తి తగ్గడం వల్ల కలిగే భయాందోళనల నుంచి పునరుత్పత్తి లక్ష్యాలను పరిష్కరించడ ంవైపు మారాలని పిలుపునిచ్చింది. లక్షలాది మంది ప్రజలు తమ నిజమైన సంతానోత్పత్తి లక్ష్యాలను సాధించలేక పోతున్నారని నివేదిక పేర్కొంది.తక్కువ జనాభా లేదా అధిక జనాభా నిజమైన సంక్షోభం కాదని, సంతానోత్పత్తి తగ్గడమే నిజమైన సంక్షోభమని యూఎన్ రిపోర్టు చెప్పింది.

# ఉగ్రవాదం ప్రపంచ సమస్యే...



# ద్వైపాక్షికం కాదు...

## జైశంకర్ ఘాటు వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,జూన్,10:** ఉగ్రవాదాన్ని ప్రపంచ సమస్యగా పరిగణించాలని,కేవలం రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక అంశంగా చూడకూడదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఐరోపా దేశాల పర్యటనలో భాగంగా బెల్జియం, లక్సంబర్గ్‌లలో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. చారిత్రకంగా చూస్తే, ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక ఉగ్రవాద దాడుల మూలాలు పాకిస్థాన్‌తో ముడిపడి ఉన్నాయని ఆయన ఆరోపించారు. బెల్జియంలో జరిగిన కార్యక్రమంలో ఆ దేశ విదేశాంగ మంత్రి మాక్సిమ్ ప్రెవోట్ కూడా జైశంకర్‌తో పాటు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, భారతదేశ పురోగతి, దేశ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను జైశంకర్ వివరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం జరిగిన పరిణామాలపై మాట్లాడుతూ, "ఉగ్రవాదం అనేది ఫలానా దేశానిది, మీది కాదు, నాది కాదు అని అనుకోవద్దు. ఇది ఒక ప్రపంచ సమస్య" అని ఆయన అన్నారు. మీడియా కూడా కొన్నిసార్లు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తుందని, భారత్-పాకిస్థాన్ సమస్యను ద్వైపాక్షిక అంశంగానో లేదా కశ్మీర్ సమస్యగానో చూపిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. "వాస్తవానికి ఉగ్రవాద సమస్య ఇతర దేశాలకు భిన్నంగా ఉంటుంది. కొన్ని సంస్థలు ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కానీ, కొన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తమ అధికారిక విధానంగా పెట్టుకుని నిర్వహిస్తు న్నాయి" అని జైశంకర్ తీవ్రంగా విమర్శించారు. ఐరోపాలోని ప్రజలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. "యూరప్‌లో కూడా ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయి. కానీ, దానిని రెండు దేశాల మధ్య అంశంగా ఎవరూ చూడరు.

వారి పొరుగు దేశాల్లో ఏదీ ఉగ్రవాదాన్ని అధికారిక విధానంగా పెట్టుకోలేదు. ఇది ఏ రెండు దేశాలకు సంబంధించిన అంశమని నేను భావించడం లేదు. ఉగ్రవాదం కేవలం భారత్‌కు సంబంధించిన సమస్యే కాదు. గత 20-30 ఏళ్లగా గమ నిస్తే,చాలా ఉగ్రదాడుల మూలాల దర్యాప్తులు పాకిస్థా న్‌లోకి వచ్చి ఆగిపోతాయి" అని ఆయన వ్యాఖ్యానించారు.



## ఆస్ట్రియా స్కూల్లో కాల్పులు...

### 10 మంది మృతి

గ్రాజ్ :ఆస్ట్రియాలోని రెండో అతిపెద్ద నగరమైన గ్రాజ్‌లో మంగళవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి బోర్గ్ డ్రెయిర్‌షుట్జెన్‌గాస్సే పాఠశాలలో ఓ విద్యార్థి జరిపిన కాల్పుల్లో పలువురు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. అనంతరం నిందితుడైన విద్యార్థి పాఠశాల టాయిలెట్‌లో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో ఈ దారుణం జరిగింది. పాఠశాల భవనం లోపలి నుంచి తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించడంతోవెంటనే పోలీసులకు సమాచారం అందింది. ఆస్ట్రియా ప్రభుత్వ ప్రసార సంస్థ ఓఆర్ఎఫ్ కథనం ప్రకారం,కనీసం 10 మంది మరణించ గా,పలువురు గాయపడ్డారు.అయితే, మృతుల సంఖ్యను అధికారులు ఇంకా అధికారికంగా ధృవీకరించలేదు. మరణించిన వారిలో విద్యా ర్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా ఉన్నారని స్థానిక మీడియా తెలిపింది.

## ఢిల్లీని నాశనం చేశారు..



### బీజేపీపై కేజ్రీవాల్ విమర్శలు

**న్యూఢిల్లీ,జూన్, 10:** బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఢిల్లీని నాశనం చేసిందని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ విమర్శించారు. బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఢిల్లీని నాశనం చేసిందని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిలీమాజీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్ విమర్శించారు.ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. ఢిల్లీ మాజీ సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నాయకురాలు అతిషిని పోలీసులు అరెస్ట్ చేసిన నేపథ్యంలో కేజ్రీ వాల్ ఈ పోస్టు పెట్టారు.వేతలకు వ్యతిరే కంగాకల్కాజీలోని భూమిహీన్ క్యాంపులో జరుగుతున్న ఆందోళనల్లో అతిషి పాల్గొన్నారు.

# ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి..




## ఉత్తమ్‌కు అధిష్టానం పిలుపు...

**న్యూఢిల్లీ,జూన్, 10:** తెలంగాణలో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు అంశం ఉత్కంఠ రేపుతోంది. మొన్న ముగ్గురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేయగా వారికి శాఖల కేటాయింపు అంశంలో ఎలాంటి క్లారిటీ రాలేదు. ఇదే విషయంలో అధిష్టానం పెద్దలతో చర్చలు జరిపేందుకు రెండు రోజులుగా ఢిల్లీలోనే సీఎం రేవంత్ రెడ్డి మకాం వేశా రు. ఈ నేపథ్యంలో అనూహ్యంగా సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు రావడం హాట్ టాపిక్ గా మారింది. దీంతో ఆయన హుటాహుటీన ఢిల్లీకి పయనం అయ్యారు. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు, టీపీసీసీ కార్యవర్గ కూర్పు వంటి అంశాల నేపథ్యంలో ఉత్తమ్ కుమార్ కు ఏఐసీసీ పెద్దల నుంచి పిలుపు రావడం రాష్ట్ర కాంగ్రెస్ లో ఆసక్తిని రేపుతోంది....

సీఎం ఢిల్లీలో ఉండగానే పీసీసీ కార్యవర్గాన్ని అధిష్టానం ప్రకటించింది. అయితే ఉన్నపలంగా ఉత్తమ్ కుమార్ రెడ్డికి పార్టీ పెద్దల నుంచి పిలుపు రావడం వెనుక కొత్త మంత్రులకు శాఖలను కేటాయింపు అంశంపైనే చర్చిస్తారా లేక ప్రస్తుత మంత్రుల శాఖల్లో మార్పులపై చర్చించేందుకు పిలిచారా అనేది తెలియాల్సి ఉంది. ఇవేవి కాకుండా పార్టీ పరంగా ఎదైనా కీలక మార్పు ఉండబోతున్నదా అనేది సస్పెన్స్‌గా మారింది. మొత్తంగా తెలంగాణ కాంగ్రెస్ లో తాజా పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇటీవల తెలంగాణలో జరిగిన మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో, కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు, కొందరు మంత్రుల శాఖలలో మార్పులపై చర్చ జరిగింది. సీనియర్ మంత్రులు వివిధ శాఖలను నిర్వహిస్తున్న నేపథ్యంలో, కొన్ని శాఖలను ఇతరులకు బదిలీ చేసే అంశంపై కూడా సంప్రదింపులు జరిగాయి. నిన్న టీపీసీసీ కార్యవర్గ నియామకాలు చేపట్టగా.. పదవులు దక్కని వారికి న్యాయం చేసేందుకు వివిధ రాష్ట్ర రంగ సంస్థలకు చైర్మన్ పదవులను కట్టబెట్టే దిశగా చర్చలు జరిగాయి. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కుల గణనకు సంబంధించి జనంలో ప్రాచుర్యం కల్పించేందుకు రాష్ట్రంలో భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి, రాహుల్ గాంధీ, ఖర్గే వంటి సీనియర్ నాయకులను ఆహ్వానించే ప్రతిపాద నలు జరిగాయని సమాచారం.మెదక్‌లో ఎస్సీ వర్గీకరణ సభ,బీసీ కుల గణన సభలను నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది.



## హైకోర్టులో హరీశ్‌రావుకు ఊరట..

### ఎన్నికల పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్,జూన్ 10,తెలంగాణ దిశ:** తెలంగాణ హైకోర్టులోమాజీ మంత్రి హరీశ్ రావుకు ఊరటలభిచంఇంది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది.ఎన్నికల అఫిడవిట్‌లో హరీశ్‌రావు సరైన వివరాలు ఇవ్వలేదని గతంలచక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టులో మాజీ మంత్రి హరీశ్ రావుకు ఊరట లభిచంఇం ది. ఆయనపై వేసిన ఎన్నికల పిటిషన్‌నుకోర్టుకొట్టివేసింది. ఎన్నికలఅఫిడవిట్‌లో హరీశ్ రావు సరైన వివరాలు ఇవ్వలేదని గతంలో చక్రధర్ గౌడ్ వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేటలో బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, కాంగ్రెస్ నుంచి హరికృష్ణ,బీఎస్పీ నుంచి చక్రధర్ గౌడ్ పోటీ చేశారు. అయితే ఈ ఎన్నికల్లో గెలిచిన హరీశ్‌రావు అఫిడవిట్‌లో పూర్తి సమాచారం వెల్లడించకుండా రహస్యంగా ఉంచారని చక్రధర్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు.

# కర్ణాటకలో మళ్లీ..కులగణన..?

**బెంగళూరు,జూన్, 10:** కర్ణాటక ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో మరోసారి కులగణన చేపట్టనున్నట్టు కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారంనాడు ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం తమను ఆదేశించినట్టు చెప్పారు.కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రస్తుతం ఢిల్లీలో ఉన్నారు. అధిష్ఠానం సూచనలు మేరకు కర్ణాటకలో కులగణన తిరిగి చేపట్టనున్నట్టు ఈ సందర్భంగా డీకే శివకుమార్ ప్రకటించారు. కులగణనకు సంబంధించి ప్రతి ఒక్కరి అభిప్రాయాలను క్రోడీకరించాలని అధిష్ఠానం సీఎంకు, తనకు చెప్పినట్టు ఆయన తెలిపారు. ఇంతకుముందు కులగణనలో తమను పరిగణనలోకి తీసుకోలేదని ఎవరైతే భావిస్తున్నారో వారికి మరో అవకాశం ఇస్తున్నామని,రాష్ట్ర మంత్రి వర్గం దీనిపై చర్చించి, ఒక ప్లాన్‌తో ముందుకు వస్తుందని, అందరికీ న్యాయం చేస్తుందని ఆయన చెప్పారు. కర్ణాటక ప్రభుత్వం గత ఏప్రిల్‌లో కులగణన సర్వే రిపోర్టును సమర్పించగా, ఇందులో తప్పుడు లెక్కలు ఉన్నాయంటూ లింగాయత్, వొక్కలింగ కమ్యూనిటీలు ఆరోపించాయి. జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామని ఇటీవల జరిగినక్యాబినెట్ సమావేశంలో నిర్ణయించింది. కులగణనచేపట్టను న్నట్టు ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.






## కార్గో షిప్‌లో కొనసాగుతున్న పేలుళ్లు, మంటలు

**న్యూఢిల్లీ,జూన్,10:** కేరళ తీరంలో కార్గో షిప్ లో రెండో రోజు కూడా మంటలు, పేలుళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. సింగపూర్ నుంచి వచ్చిన కంటైనర్ నౌక లో మంటలు ఉహించని విధంగా మంటలు చెలరేగాయి. అయితే ఈ సమాచారం అందుకున్న రెస్క్యూ సిబ్బందిమంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. అయినప్పటికి కంటైనర్లలో ఉన్న వివిధ కెమికల్ పదార్థాల కారణంగా పేలుళ్లు కొనసాగుతున్నాయి. దీంతో నాలుగు రెస్క్యూ బోట్లు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికీ.. మంటలు అదుపులోకి రావడం లేదు. కాగా మిడ్-షిప్ ప్రాంతం- వసతి బ్లాక్‌కు ముందున్న కంటైనర్ బే నుంచి మంటలు చెలరేగుతున్నట్లు భారత కోస్ట్ గార్డ్ అధికారులు మంగళవారం తెలిపారు. కాగా ఈ ఘటనపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. మంటలను వ్యాపించకుండా నిరోధించడానికి భారతీయ కోస్ట్ గార్డ్ నౌకలు సముద్ర ప్రహరి, సాచెట్ సముద్రంలో అగ్నిమాపక సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధిం చిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆ వీడియోలో షిప్‌లో దట్టమైన పొగ వ్యాప్తి చెందడం కిలోమీటర్ల మేర కనిపించడం వైరల్‌గా మారింది.




## కర్ణాటక కాంగ్రెస్‌లో భారీ మార్పులు..?

**బెంగళూరు,జూన్, 10:** కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కర్ణాటక కాంగ్రెస్ నేతలపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో కర్ణాటక లో ముఖ్యమైన నేతల బాధ్యతలు, పార్టీ కేడర్‌లో భారీ మార్పులు ఖాయమనే ప్రచారం జరుగుతోంది. పార్టీ వర్గాల సమాచారం మేరకు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, హెూంమంత్రి జి. పరమేశ్వరన్ కీలక బాధ్యతలు కోల్పోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ సూచన మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రణదీప్ సుర్జేవాలా, కే సీ వేణుగోపాల్ తదితర అగ్రనేతలు కేబినెట్ మార్పులపై త్వరలోనే కీలక సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సీనియర్ నేతలు బీకే హరిప్రసాద్, ఆర్వీ దేశ్‌పాండే లాంటి నాయకులు మంత్రివర్గంలోకి చాన్స్ వచ్చేలా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కార్యాలయంలోనూ పలు మార్పులు చోటు చేసుకోనున్నాయి. తాజాగా రాజీనామా చేసిన సీఎంవో రాజకీయ కార్యదర్శి కే. గోవిందరాజ్ స్థానంలో కొత్త నేతను నియమించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి.ప్రస్తుతం కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా డీకే శివకుమార్బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# అమాయకులను ఇబ్బందులు పెడుతున్న కుషాయిగూడ పోలీసులు...

## - ప్రైవేటు లెక్చరర్ విషయం మర్చిపోకముందే...
## - పది రోజులుగా గిరిజనుడిని వేధిస్తున్న పోలీసులు
## - అత్యుత్సాహంతో కేసు నమోదు..,
## రాచకొండ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదుతో వెలుగులోకి...



TELANGANA STATE POLICE
KUSHAIGUDA POLICE STATION
RACHAKONDA POLICE COMMISSIONERATE
CASE DIARY DOCKET SHEET

Name of the I.O. : Sri. R.Ramulu, SIP

STC / CC / PRC / SC. No. : –

| | | |
|---|---|---|
| 1. | F.I.R. No./Cr. No. | 409/2025 |
| 2. | Section of Law | U/s 325 BNS, 5, 6, 10 TG PCS and APA Amendment Act 1977, 11, 38 PCAA |
| 3. | Place of Occurrence | ECIL 'X' Road |
| 4. | Date and Time of Occurrence | 03/06/2025 at 12.00 Hours |
| 5. | Date and Time of Report | 03/06/2025 at 12.30 Hours |
| 6. | Name of the COMPLAINANT and address particulars with contact No. | N. Sudhakar Reddy, SI of Police. |
| | Date of Arrest : | |
| 7. | Name of the ACCUSED: Address with Contact No. | A1) Naresh Yadav A2) Bhukya Shankar. |
| 8. | Name of the Deceased / Missing Person | – |

**కుషాయిగూడ, జూన్ 10, (తెలంగాణ దిశ):** కుషాయిగూడ పోలీసుల తీరు వల్ల అమాయకులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్ల ఓ ప్రైవేటు లెక్చరర్ ఇబ్బందులు పడిన విషయం మర్చిపోక ముందే.., పోలీసుల అత్యుత్సాహం వల్ల ఓ గిరిజనుడు ఇబ్బందులు పడుతున్న మరో సంఘటన చోటు చేసుకుంది. బొలెరో వాహనంలో గోవులను తరలిస్తున్న విషయంలో గిరిజనుడిపై తొందరపాటులో కేసు నమోదు చేసారు. తర్వాత విచారణలో గోవులను కొండమడుగు సంతలో కొనుగోలు చేసి పాల డైయిరీకి తరలిస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు "చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు" ఎలాగో కేసు నమోదు చేశాం." కోర్టులో వాహనాన్ని తెచ్చుకోమని " చావు కబురు చల్లగా చెప్పారు. దీంతో చేసేదేమీ లేక పోలీసుల తీరుపై సదరు బాధితుడు రాచకొండ పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన వెలుగులోకి వచ్చింది.

**వివరాలు ఇలా ఉన్నాయి..**

ఈ నెల మూడవ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు గోవులను తీసుకొని ఈసీఐఎల్ చౌరస్తా మీదుగా బోయిన్ పల్లె కి వెళుతున్న ఒక బొలెరో వాహనాన్ని స్థానిక బిజెపి నాయకులు అడ్డుకున్నారు. బక్రీద్ సందర్భంగా గోవులను అక్రమంగా వధించేందుకు తీసుకు వెళుతున్నారని భావించిన వారు కుషాయిగూడ పోలీసులకు ఫోన్ చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈసీఐఎల్ చౌరస్తాలో విచారణ చేస్తే మీడియాకు తెలుస్తుందని..., గోవులతో సహా వాహనాన్ని పోలీస్ స్టేషన్ వెనుక ప్రాంతంలోకి తీసుకువెళ్లి విచారణ జరిపారు. అయితే తాను గోవులను కమేళాకు తరలించడం లేదని, ఇవి పాలు ఇచ్చే గోవులని, వీటిని డైయిరీ ఫామ్ కు తరలిస్తున్నానని ఎంత చెప్పినప్పటికీ



వినిపించుకొని పోలీసులు లాభం లేదనుకుని కేసు నమోదు చేశారు. తరువాత సదరు గోవులను పాల వ్యాపారం చేసే నరేష్ యాదవ్ అనే వ్యక్తి కొండమడుగు పశువుల సంతలో కొనుగోలు చేసి బోయిన్ పల్లిలోని డైయిరీ ఫామ్ కు తరలిస్తున్నారన్న విషయం ఆధారాలతో సహా నిరూపించాడు. అప్పటికే గిరిజనుడికి మాయమాటలు చెప్పి నాగోల్ లోని జిహెచ్ఎంసి వెయిటర్నరీ విభాగానికి సంబంధించిన ప్రదేశానికి గోవులను తరలించారు.

బులోరా వాహనాన్ని తెచ్చి కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో ఉంచారు. తాము గోవులను అక్రమంగా తరలించడం లేదని, పాల డైయిరీ ద్వారా వ్యాపారం చేసుకుంటామని గోవుల యజమాని నరేష్ యాదవ్ తో పాటు గోవులను తరలిస్తున్న గిరిజనుడు శంకర్ మొరపెట్టుకున్నప్పటికీ లాభం లేకుండా పోయింది. అప్పటికే 2025/409 నెంబర్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 325 బిఎన్ఎస్, 5, 6, 10 టీజీఐపిసి, 11, 38 పిసిఎఎ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. తర్వాత చేసిన తప్పును తెలుసుకున్న పోలీసులు గోవులను ఇవ్వాలని నాగోల్ లోని వెటర్నరీ డాక్టర్ కు లేఖ రాశారు. కేసు నమోదు చేసి గోవులను స్వాధీనం చేశారని, ఇలా స్వాధీనం చేసిన గోవులను ఎలా ఇస్తామని వెటర్నరీ డాక్టర్ ప్రశ్నించడంతో పోలీసులు కంగు తిన్నారు. ఈ విషయంలో గత వారం రోజుల నుంచి పోలీసుల చుట్టూ తిరుగుతున్న సదరు గిరిజనుడు తన గోవులతో పాటు మహేంద్ర బొలెరో వాహనాన్ని అప్పగించాలని ప్రాధేయపడుతున్నప్పటికీ లాభం లేకుండా పోయింది. "కోర్టుకు అప్పగిస్తాం.. వెళ్లి తెచ్చుకోవాలని" చావు కబురు చల్లాగా చెప్పారు. బాధితుడు సోషల్ మీడియా ద్వారా రాచకొండ పోలీస్ కమిషనర్ ను సంప్రదించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

**కుషాయిగూడ పోలీసుల వివరణ**

ఈ నెల3 తేదీన మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ప్రజల సమాచారం మేరకు శేఖర్, నరేష్ యాదవ్ అనే వ్యక్తులు మహీంద్రా బొలెరో (టిఎస్ 30టి1775) వాహనంలో రెండు ఆవులు, రెండు దూడలను వాటికి తగినంత స్థలం లేకుండా క్రూరంగా రవాణా చేస్తున్నందుకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జంతు హింసకు సంబంధించి వారి పై 409/2025 కింద ఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆవులు, దూడలను రక్షించడానికి గౌశాలకు పంపించినట్లు తెలిపారు. పైన పేర్కొన్న వ్యక్తులు చట్టపరమైన విధానాలను అనుసరించి లీగల్ ప్రాసెస్ ద్వారా తమ వాహనం, జంతువులను తిరిగి పొందవచ్చని వారికి సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

**"మహీంద్రా బొలెరో" నాలుగు జంతువుల రవాణా క్రూరమేలా అవుతుంది...?**

యాదాద్రిభువనగిరి జిల్లా కొండమడుగు గ్రామంలో జరిగిన సంతలో డైయిరీఫామ్ కోసం కొనుగోలు చేసిన రెండు ఆవులు, రెండు దూడలు బొలెరో వాహనంలో రవాణా చేయడక్రూరం ఎలా అవుతుందో అర్థం కావడం లేదు. జంతు హింసకు సంబంధి చి కేసు నమోదు చేసిన పోలీసులు తిరిగి జంతువులను ఇచ్చివేయా లని గోశాల నిర్వాహకులను ఎందుకు కోరారో అర్థం కావడం లేదు. ఈ మేరకు కేసు నమోదు చేసిన సబ్ ఇన్ స్పెక్టర్ ఆడియో రికార్డు బయటికి వచ్చినప్పటికీ తప్పును కప్పిపుచ్చుకోవడం గమనార్హం.

# సినీ సిటీకి హైదరాబాద్ ను రాజధానిగా తీర్చిదిద్దాలి



## - డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయండి
## - 14న గద్దర్ సినిమా అవార్డులు అంగరంగ వైభవంగా నిర్వహించాలి
## - సినిమా రంగ సమగ్ర అభివృద్ధి
## సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ - సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, జూన్ 10, (తెలంగాణ దిశ) :** సినిమా సిటీకి హైదరాబాద్ నగరాన్ని రాజధానిగా మార్చేందుకు అవసరమైన డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్) సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం, మంత్రుల సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క సమాచార శాఖ కమిషనర్, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. మంత్రులు, సబ్ కమిటీ సభ్యులైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమావేశంలో పాల్గొని పలు అంశాలపై చర్చించారు. హైదరాబాదును సినిమా సిటీగా అభివృద్ధి చేసి, దేశ, విదేశాల నుంచి సినిమా రంగ ప్రముఖులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సినిమా షూటింగ్ చేయాలంటే పోలీసు శాఖ, అగ్నిమాపక శాఖ, మున్సిపల్ శాఖ వంటి వివిధ శాఖల నుంచి విడివిడిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంది, ఫలితంగా సినీ పరిశ్రమ నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు, ఈ సమస్యను పరిష్కరించాలని పెట్టాలని సబ్ కమిటీ నిర్ణయించింది. వివిధ శాఖల నుంచి ఇవ్వాల్సిన అనుమతులను ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లో ఒక అధికారిని నియమించి వారి ద్వారా అన్ని శాఖల నుంచి అనుమతులు త్వరితగతన ఇప్పించేలా సింగిల్ విండో పద్ధతిని ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని పర్యాటక ప్రాంతాల్లో షూటింగులు జరగడం మూలంగా పర్యాటక రంగం అభివృద్ధికి అవకాశం ఉందని తెలిపారు.

సినిమా థియేటర్లలో క్యాంటీన్ల ద్వారా విక్రయిస్తున్న తినుబండారాలు ఇతర వస్తువులు అత్యధిక రేట్లకు విక్రయిస్తున్నారని, దీంతో సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఈ నేపథ్యంలో ధరలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ కు గతంలో రాష్ట్ర ప్రభుత్వం 50 ఎకరాలు మంజూరు చేసిందని, ప్రస్తుతం ఆ భూమి పరిస్థితి, వాటి వివరాలను వచ్చే సమావేశం నాటికి తీసుకురావాలని సబ్ కమిటీ అధికారులను ఆదేశించారు. సినీ కార్మికుల కోసం నిర్మించిన చిత్రపురి కాలనీ పై ఏర్పాటుచేసిన ఆర్ సిఎస్ కమిటిని వచ్చే సమావేశానికి పిలిపించాలని సూచించారు. ఈనెల 14న ఏర్పాటు చేస్తున్న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డ్స్ ఫంక్షన్ ను "న భూతో.. న భవిష్యత్తు" అన్నట్లుగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు సినీ రంగ ప్రముఖుల అందరిని ఆహ్వానించాలని, తెలుగు సినిమాతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ సినీ నటులను గుర్తించి ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. సమావేశంలో ఎఫ్ డీసీ చైర్మన్ దిల్ రాజు, హోం శాఖ స్పెషల్ సిఎస్ రవి గుప్తా, సమాచార శాఖ కమిషనర్ హరీష్, ఎఫ్ డీసీ డైరెక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# దోమల వల్ల వ్యాపించే జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలి



**హబ్సిగూడ, జూన్ 10, (తెలంగాణ దిశ) :** జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి ఉమాగౌరి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని హబ్సిగూడ బస్తీ దవాఖానను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య సేవలను సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత వైద్య అధికారూలకు సూచనలు ఇచ్చారు. దోమల వల్ల వ్యాపించే జ్వరాల నివారణకు జిహెచ్ఎంసి సమన్వయ ంతో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

# కులగణన సర్వే
## ఆధారంగానే రేషన్ కార్డులు..!

కరీంనగర్: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ కులగణన సర్వే ఆధారంగా జారీ చేయనున్నారు. అయితే కులగణనలో ఖచ్చితత్వం ఎంత? అన్న దానిపైనే ఇప్పుడు అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇళ్లకు వచ్చి యజమానులు చెప్పిన వివరాల ఆధారంగానే నమోదు చేసుకుని సర్వే సిబ్బంది వెళ్లారు. అయితే ఇది ఖచ్చితమైన సమాచారం అనేది మాత్రం క్లారిటీ లేదు. కొందరు పొలాలు, ఆస్తులను దాచి ఉంచారన్న కామెంట్స్ కూడా వినిపించాయి. ప్రభుత్వ పథకాలు తమకు అందవన్న భయంతోనే ప్రజలు తమ ఆస్తుల విషయాన్ని బయటపెట్టలేదని కూడా వార్తలు వచ్చాయి. అదే సమయంలో సిబ్బంది కూడా తూతూమంత్రంగా చేసిన ఈ సర్వే ప్రాతిపదికన రేషన్ కార్డులు మంజూరు చేస్తే ఎలా? అన్న ప్రశ్న కూడా తలెత్తుతుంది. కులగణన లో అనేక ప్రశ్నలు వేశారు. యాభైకి పైగా ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడంలో సర్వే సిబ్బంది యాంత్రికంగానే వ్యవహరించారు. కనీసం వారి ఆదాయం గురించి కూడా ఆరా తీయలేదు. దీనివల్ల అనర్హులు ఎక్కువ మంది తెలుపు రంగు రేషన్ కార్డులు పొందే అవకాశముందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. రేషన్ కార్డుల జారీకి కులగణన సర్వే ప్రాతిపదిక కాకూడదు. దానికి నిబంధనలు వేరుగా ఉంటాయి. ఆదాయ పరిమితితో పాటు దారిద్య్ర రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడానికి అనేక మార్గాలున్నాయి. ఇప్పుడు తెలంగాణ జరిగిన కులగణన వల్ల ఖచ్చితమైన సమాచారం వచ్చిందన్న నమ్మకం ఎవరికీ లేదు. మరి దాని ప్రాతిపదికన ఎలా రేషన్ కార్డులు మంజూరు చేస్తారన్న ప్రశ్నకు పాలకుల వద్ద సమాధానం లేదు. పాత రేషన్ కార్డులను కూడా తొలగించే ప్రసక్తి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణలో కొత్త రేషన్‌కార్డుల పంపిణీ జరగనుంది. రేషన్‌కార్డుల ఫైనల్ లిస్ట్ ను దాదాపు అధికారులు సిద్ధం చేశారు. కులగణన సర్వే ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక చేస్తున్నట్లు కూడా ప్రకటించారు. కొత్తగా ఆరున్నర లక్షల రేషన్‌కా ర్డులు ప్రభుత్వం జారీ చేసే అవకాశముందని కూడా చెబుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులను కూడా గ్రామసభలో నిర్ధారించి రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయంతీసుకుందని చెబుతున్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కూడా ప్రకటన చేసింది. అయితే అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని, అనవసరంగా ప్రజా ధనం దుర్వినియోగం చేసేలా కేవలం కులగణన సర్వేపై ఆధారపడవద్దన్న సూచనలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.

# జీరో సైజ్ ...మోసాలు... ఇంతింత కాదయా...?

హైదరాబాద్: అనుష్క నటించిన జీరో సైజ్ సినిమా చూసే ఉంటారు. కాస్త బొద్దుగా ఉండే అనుష్క.. స్లిమ్ గా మారిపోవాలని ఓ క్లినిక్ లో చేరిపోతుంది. అక్కడ తనలాగే వందల మంది కనిపిస్తారు. క్రమంగా.. రోజులు గడిచే కొద్దీ అసలు విషయం బోధపడుతుంది. అదంతా ఓ వ్యాపారమని.. వారి ఆశలు, మరొకరికి వ్యాపార అవసరాలని గుర్తిస్తుంది. అనైతిక పద్ధతుల్లో, సరైన శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండానే బరువు తగ్గించే టిప్స్ అంటూ..వినియోగదారుల్ని మోసం చేస్తున్నట్లు గుర్తించి.. పోరాడుతుంది. సరిగా అలాంటి ఘటనే హైదరాబాద్ లో చోటు చేసుకుంది.కాస్తా బరువు పెరిగితే చాలా అమ్మాయిలు తెగ బాధపడిపోతుంటారు. అందమంతా కోల్పోయినట్లు దిగాలు చెందుతారు. ఎవరో ఏదో అనుకుంటారనే అనుమానంతో బరువు తగ్గేందుకు శతవిధాల ప్రయత్నిస్తుంటారు. అలాంటి వాళ్లే టార్గెట్ గా అనేక సంస్థలు పుట్టుకొచ్చాయి. మోసపోయే వాళ్లు ఉన్నంత కాలం.. మోసం చేసే వాళ్లు ఉంటారు అన్నట్లుగా ఇదో వ్యాపారంగా మారిపోయింది. ఉన్నఫళంగా బరువు తగ్గిపోవాలని కోరుకునే వాళ్ల ఆశలకు అంతు లేనప్పుడు.. వారికి మంచి మాటలతో లక్షలు, కోట్లు పోగుసుకునే వాళ్లూ ఉంటూనే ఉంటారు. ఇలాంటి ఓ సంస్థకు రాష్ట్ర వినియోగదారుల కమిషన్ షాక్ ఇచ్చింది. వైద్యుల సలహా లేకుండా, నిపుణుల పర్యవేక్షణ లేకుండా ఊబకాయం, శరీరంలోని అధిక కొవ్వును తగ్గిస్తామనే క్లినిక్ లపై నివేదిక సమర్పించాలంటూ.. హైదరాబాద్ డీఎండహెచ్‌వో, వైద్య విధాన పరిషత్ లకు ఆదేశాలు జారీ చేసింది. బరువు తగ్గిస్తామని చెప్పి.. భారీగా డబ్బులు కట్టించుకున్న ఓ సంస్థ నుంచి తిరిగి వడ్డీతో సహా తిరిగి వసూలు చేసింది.సంగారెడ్డికి చెందిన ఓ యువతి అధిక బరువు తగ్గించుకునేందుకు హైదరాబాద్, హఫీజ్‌పేటలోని కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే క్లీనిక్ ను సంప్రదించింది. 2022లో కలర్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్ మియాపూర్ బ్రాంచిలో చేరి రూ. 1.05 లక్షలు ఫీజుగా చెల్లించారు. కానీ..అక్కడ అనుకున్న మేర ఫలితాలు రాకపోవడం, సరైన వైద్య సహాయం లేకుండానే చికిత్స అందిస్తుండడంతో.. ఆ యువతి తనకు అందిస్తున్న కోర్సు నుంచి బయటకు వచ్చేసింది.

తాను చెల్లించిన డబ్బుల్ని తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేసింది. సదరు సంస్థ నిరాకరించడంతో.. సంగారెడ్డిలోని జిల్లా వినియోగదారుల కమిషన్ ను ఆశ్రయించింది ఆయువతి. బరువు తగ్గిస్తామని చెప్పి తనను మోసం చేశారని, అధికంగా డబ్బులు వసూలు చేసి మోసం చేసారంటూ ఫిర్యాదు చేసింది. దీనిపై విచారించిన జిల్లా వినియోగదారుల కమిషన్? ఫిర్యాదుదారుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. యువతి చెల్లించిన ఫీజు తిరిగి చెల్లించాలని సూచించింది. ఈ తీర్పును వ్యతిరేకించిన కలర్స్.. రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ను సంప్రదించారు.ఈ కేసు వివరాల్ని పరిశీలించిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలు మీనా రామనాథన్, సభ్యులు వి.వి.శేషుబాబులతో కూడిన ధర్మాసనం.. క్లినిక్ కు వ్యతిరేకంగా తీర్పు వెలువరించింది. నిబంధనలకు విరుద్ధంగా యువతి నుంచి డబ్బులు వసూలు చేయడంతో పాటు బరువు తగ్గిస్తామని మోసం చేసినట్లు గుర్తించింది. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద సదరు సంస్థ రిజిస్ట్రేషన్ చేయించుకున్నప్పటికీ.. బరువు తగ్గించే అంశం అందులో లేదని గుర్తు చేసింది. కేవలం..

ఫిజియోథెరపీ, చర్మ రక్షణకు సంబంధించిన అనుమతి మాత్రమే ఉందని తెలిపింది. అలాంటప్పుడు.. ప్రభుత్వ అనుమతి లేకుండా, వైద్యుల పర్యవేక్షణ లేకుండా.. యువత నుంచి డబ్బులు ఎలా స్వీకరించారని, అలాంటి సర్వీసులు ఎందుకు అందిస్తున్నారంటూ మండిపడింది. సరైన ధ్రువపత్రాలు లేకుండా ఇలాంటి సంస్థలను నిర్వహించడం సేవా లోపమంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.ఎలాంటి అనుమతులు, సర్టిఫికెట్, లైసెన్స్ లేకుండా బరువు తగ్గిస్తామని హామీ ఇచ్చిన సంస్థకు జలక్ ఇచ్చింది.

# సంపాదకీయం

## ఆరోగ్య హక్కు చట్టం అవసరం

ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశాలను అనుసరించి ఆరోగ్యానికి సరిపడా బడ్జెట్ కేటాయింపులు చేయాలి. ప్రజలందరికి రక్షిత మంచినీరు, సమతుల ఆహారం అందించాలి. పటిష్ట ఆసుపత్రుల వ్యవస్థ, సరిపడ ఆరోగ్య, వైద్య సిబ్బంది, ఆసుపత్రులలో మౌలిక వసతులను కల్పించాలి. దీనితో పాటు ప్రజలందరికి అందుబాటు ధరల్లో మందుల లభ్యత మొదలగు సవన్నీ కల్పించడం ద్వారా రోగులకు ఉపశమనం కల్పించడం ప్రధాన గా ప్రభుత్వ బాధ్యత. కానీ, కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. మందుల ధరలను నియంత్రించే బాధ్యత నుండి అడ్డగోలుగా తప్పుకున్నది. అసలే వైద్య ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ధరల పాలసీ రోగులపై మరింత భారం అవుతుంది. ఇటీవల ఏప్రిల్ 1వ తేదీ నుండి 800 రకాల మందుల ధరలు పెరగడం ఈ విధానంలో భాగమే. మందుల కంపెనీ యజమానులకు అనుకూల విధానాలు చేయడంలో మోడీ ప్రభుత్వం ఏ మాత్రం వెనకాడటం లేదు. ఈ ధరాఘాతం బి.పి, షుగర్ (పటిక) మాత్రమేగాక అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన మందుల పైనా పడి ప్రజలు భారం మోయలేకున్నారు. ప్రభుత్వ విధానాలే అనుకుంటే ఇటు మందుల కంపెనీల అనైతిక వ్యాపార విధానాలు బజారులో పెచ్చుమీరుతున్నాయి. వైద్యులను, ఫార్మసీల యజమానులను ప్రలోభపెట్టడం, విపరీతమైన కమీషన్లు-ప్రోత్సాహకాలు ఇవ్వడం, విదేశీ యానాలు, ఖరీదైన బహుమ తులు ఇవ్వడం, బల్క్ పర్చేజ్ పేరుతో ఆసుపత్రులు, ఇన్‌స్టిట్యూషన్ల పర్చేజ్ పేరిట డిస్కౌంట్లు సిబ్బందికి విపరీతమైన లాభాల మార్జిన్లు ఆఫర్ చేయడంతోపాటు, బల్ల కింద లంచాల వరకు అన్ని రకాల అనైతిక చర్యలకు మందుల కంపెనీల యాజమాన్యాలు పాల్పడుతున్నాయి. ఈ ఫార్మా కంపెనీల మందుల అమ్మకాల విధానాలపై చట్టపరమైన నియంత్రణ వుండాలని చాలా సంవత్సరాలుగా జన్ స్వాస్థ్య అభియాన్ (జె.ఎస్.ఎ), ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్.ఎమ్.ఆర్.ఎ.ఐ), ఆల్ ఇండియా డ్రగ్ యాక్షన్ కమిటీ (ఎ.ఐ.డి.ఎ.సి) వంటి స్వచ్ఛంద సంస్థలు పోరాడుతున్నాయి. యుసిపిఎంపి ముసాయిదాను చట్టం చేసి, పటిష్టంగా అమలు చేసి, చట్టాన్ని ఉల్లంఘించే యజమానులను శిక్షించాలని పోరాడుతున్నాయి. కానీ కార్పొరేట్ అనుకూల మోడీ ప్రభుత్వం కనీసం యు.సి.పి.ఎం.పి పై పార్లమెంటులో చర్చించకుండా, దాన్ని చట్టం కాకుండా కేవలం కంటి తుడుపు చర్యగా స్వచ్ఛందంగానే ఈ కోడ్‌ని అమలు చేసుకోమని ఫార్మా కంపెనీలకు అప్పచెప్పింది. అంటే ఫార్మా కంపెనీ యజమానుల కమిటీ సభ్యులే మందుల మార్కెటింగ్‌లో కంపెనీలు ఈ కోడ్ అమలు చేసే రీతిని సమీక్షించి నిర్ధారించ ఇవ్వాలన్నమాట. పర్యవసానంగా మందుల కంపెనీలు నిర్లజ్జంగా రోగులను లూటీ చేసే పరిస్థితి ఇంకా పెరుగుతున్నది. యుసిపిఎంపి చట్టాన్ని అమలు చేసి రోగులకు ఉపశమనం కల్పించాల్సిన మోడీ ప్రభుత్వం చాలా ఉదాసీనంగా వ్యవహరించడానికి కారణం ఇటీవల ఎన్నికల బాండ్ల ద్వారా మందుల కంపెనీలు బిజెపికి కోట్ల రూపాయల నిధులు ఇవ్వడం. ఈ వ్యవహారం కంపెనీలకు ప్రభుత్వానికి మధ్య జరిగిన క్విడ్ ప్రో కో అని అర్థం చేసుకోవాలి. ఎస్‌బిఐ ఎలక్టోరల్ బాండ్ల డేటా గమనిస్తే మన దేశంలో కేవలం 9 బడా మందుల కంపెనీల యజమానులే బిజెపికి 400 కోట్ల రూపాయల ఎలక్టోరల్ బాండ్ల ద్వారా చందా ఇచ్చారు. ఇంకా చిన్నా పెద్దా కంపెనీలు కలసి ఎన్ని కోట్ల రూపాయల చందాలు ఇచ్చాయో తెలియాలి. ఇది పెద్ద స్కామ్. ఈ ఎలక్టోరల్ బాండ్లు ఇచ్చిన కంపెనీల జాబితాలోని ఒక కంపెనీయే చిన్న పిల్లల ప్రాణాలతో చెలగాటమాడే నాసిరకం మందులు తయారు చేసినట్లుగా ఇటీవల చాలా వార్తలు పత్రికల్లో రావడం చూశాం. యుసిపిఎంపి చట్టం అమలు లేకపోవడంవల్లే బాబా రాందేవ్ లాంటి వ్యాపారవేత్తలు బిజెపి ప్రభుత్వ వత్తాసుతో తమ పతంజలి ఉత్పత్తులపై తప్పుడు ప్రకటనలు, తప్పుడు మార్కెటింగ్ విధానాలతో ఇష్టారాజ్యంగా వ్యాపారాన్ని విస్తరించుకోవడం, దానిపై ఇటీవల సుప్రీం కోర్టు పతంజలి కంపెనీపై సీరియస్ అవ్వడం, పతంజలి కంపెనీ బహిరంగ క్షమాపణ చెప్పడం చూశాం. గణాంకాల ప్రకారం మన దేశంలో 47 నుంచి 50 శాతం వైద్య ఖర్చును ప్రజలు తమ జేబుల నుండే పెట్టుకుంటు న్నారు. అసలే ఒక పక్క ద్రవ్యోల్బణం పెరుగుతూ ప్రజల ఆదాయాలు తగ్గుతూ, పెరుగుతున్న నిత్యావసర ధరలు, విద్య, ఇతర రోజువారీ ఖర్చులు సగటు మనిషికి పెనుభారం అవుతుంటే ప్రభుత్వం రోగాల చికిత్సలు, మందుల ఇతర వైద్య ఖర్చులపై విపరీతమైన జిఎస్‌టి పన్ను భారం వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజారోగ్య వేదిక (పిఎవి), జన్ స్వాస్థ్య అభియాన్ (జెఎస్ఎ) వంటి సంస్థలు ఆరోగ్య హక్కు చట్టంగా తేవాలని అప్పుడే ప్రజలందరికి వైద్య ఖర్చుల భారం నుండి ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వాలను డిమాండు చేస్తున్నాయి. 2024 ఎన్నికల నేపథ్యంలో పిఎవి ఆరోగ్య హక్కు చట్టం ముసాయిదాని రూపొందించి అన్ని రాజకీయ పార్టీలకు పంపించింది. అలాగే తమ మ్యానిఫెస్టోలో ఆరోగ్య హక్కు చట్టంపై అన్ని పార్టీలు తమ విధానం తెలియజేయాలని డిమాండు చేసింది. కేవలం వామపక్ష పార్టీలు మినహా ఏ ఇతర రాజకీయ పార్టీలు సానుకూలంగా స్పందించలేదు. పాలక, ప్రతిపక్ష పార్టీలన్నీ హెల్త్ ఇన్సూరెన్సే సంజీవని అని ప్రజల్ని మభ్యపెడుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు ప్రతి ప్రభుత్వం జిడిపిలో 5 శాతాన్ని బడ్జెట్ ప్రజారోగ్యానికి కేటాయించాలి. మన దేశంలో ప్రభుత్వాలు 1.5 శాతం–1.8 శాతం మించి కేటాయింపు చేయడం లేదు. ఇంత తక్కువ బడ్జెట్‌లో ప్రైమరీ ఆసుపత్రులను మొదలుకొని టెర్షియరీ కేర్ ఆసుపత్రుల వరకు ఉన్నత ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పించడం, మందులు/వైద్య పరికరాలు, ఆసుపత్రుల నిర్వహణ, అంబులెన్సుల నిర్వహణ, ఇన్ఫ్రాస్ట్రక్చర్, సరిపడ వైద్య ఆరోగ్య సిబ్బంది నియామకాలు, వారి జీతాలు ఎలా సాధ్యం? తక్కువ బడ్జెట్ కేటాయింపుల కారణంగానే ప్రైమరీ కేర్ మొత్తం నిర్వీర్యం అయ్యింది. ప్రభుత్వాలు ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత నుండి తప్పుకోవడానికి ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ వంటి హెల్త్ ఇన్సూరెన్సు స్కీములను తీసుకొచ్చాయి. రోగుల భవిష్యత్ అంతా ఆసుపత్రుల యాజమాన్యాలు, ఇన్సూరెన్సు కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్సూరెన్సు విధానంలో ఆసుపత్రులు-ఇన్సూరెన్స్ కంపెనీలు కుమ్మక్కై మరింత దోపిడి చేసే అవకాశం ఉంది. కాగ్ నివేదిక ప్రకారం 2022-23లో ఆయుష్మాన్ భారత్ స్కీము అమలులో 13,51,299 కేసులు నకిలీవని తేల్చింది. ఈనివేదికపై మోడీ ప్రభుత్వం మౌనం వహించింది. లక్షల మరణాలు, ఆస్పత్రు లలో ఆక్సిజన్ మొదలుకొని పడకలు, మందులు, వైద్య పరికరాల అందుబాటు, సిబ్బంది కొరత ఇలా ప్రతీ అంశంలో మన ఇన్సూరెన్సు మోడల్ ఆరోగ్య వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి.

# పురపాలికల్లో పడకేసిన పాలన

## కన్నెత్తి చూడని స్పెషల్ ఆఫీసర్లు - సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు




**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 10, (తెలంగాణ దిశ) :** జిల్లాలోని 9 మున్సిపాలిటీలు, నాలుగు నగరపాలక సంస్థల్లో పాలన పడకేసింది. పాత వర్గాల గడువు ముగిసి దాదాపు ఆరు నెలలకు వస్తుంది. మున్సిపాలిటీలకు నగర పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. దీనికి తోడు శివారులో ఉన్న 9 మున్సిపాలిటీలతో పాటు నాలుగు నగరపాలక సంస్థలను జిహెచ్ఎంసిలో విలీనం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, స్థానిక పాలనలో పూర్తిగా స్తబ్దత ఏర్పడింది. దీనికి తోడు మున్సిపాలిటీల సమీపంలోని అనేక గ్రామపంచాయతీలను మునిసిపాలిటీలలో విలీనం చేసిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పాలనపై అధికారులు పూర్తిగా పట్టు కోల్పోయారనే చెప్పవచ్చు.

పాత గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధికారులు ఎవరికి వారే యమునా తీరేగా వ్యవహరిస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్లు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పురపాలక సంఘాల పరిధితోపాటు నగరపాలక సంస్థల పరిధిలో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయి. చిన్న, చిన్న పనులు సైతం కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణ పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. దీంతో గత ఆరు నెలలుగా ఆయా స్థానిక సంస్థల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలు కార్పొరేషన్ లో యధా స్థానంలో ఉంటాయా లేనిపక్షంలో జిహెచ్ఎంసిలో కలిపేస్తారా అన్న సంక్షోభం నెలకొని ఉంది. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పెషల్ ఆఫీసర్లు చొరవ తీసుకొని స్థానిక సంస్థల పరిధిలో పాలనను గాడిలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# తీర్థ యాత్రలకు వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల



**కుషాయిగూడ, జూన్ 10, (తెలంగాణ దిశ) :** తీర్థ యాత్రలకు వెళ్లి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడి నగదు తో పాటు విలువైన బంగారు వెండి ఆభరణాలు దోచుకెళ్ళిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని హెచ్ బి కాలనీలో జరిగింది. మౌలాలి హెచ్ బి కాలనీ టిఎస్ ఐఐసి కాలనీలో నివసించే పి. రవీందర్ స్థానికంగా మెడికల్ షాప్ నిర్వహిస్తుంటాడు. కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 5వ తేదీన ఇంటి ప్రధాన తలుపుకు తాళం వేసి దక్షిణ భారతదేశ పర్యటనకు అంటే (తిరుపతి, అరుణాచలం, పాండిచ్చేరి, కాణిపాకం) బయలుదేరారు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి ప్రధాన తలుపు తాళం పగిలిపోయి ఉండటం గమనించిన అతను ఇంట్లోకి ప్రవేశించినప్పుడు బెడ్ రూమ్ లో ఉన్న బీరువా విరిగిపోయి ఉండటం, బట్టలు, ఇతర వస్తువులు చెల్లాచెదురుగా ఉండటం గమనించాడు. బీరువాను తనిఖీ చేయగా అందులో ఉండాల్సిన సుమారు లక్షన్నర నగదుతో పాటు సుమారు 30 తులాల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర తులాల వెండి వస్తువులు దొంగతనానికి గురైనట్లు గమనించాడు. గుర్తు తెలియని వ్యక్తులు తన ఇంటి ప్రధాన ద్వారా తాళం పగలగొట్టి ఇంట్లోకి చేరబడి పై వస్తువులు దొంగిలించినట్లు మంగళవారం కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**కుత్బుల్లాపూర్, జూన్ 10, (తెలంగాణ దిశ) :** నియోజకవర్గంలోని 125 డివిజన్ తమిళ్ బస్తీకు చెందిన పలువురు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. తమిళ్ బస్తీకి చెందిన కాశీమణి, రాజేందర్, కృష్ణ, శాంతి, సెల్వి, సుగుణ, నాగేంద్ర, రోజా, మేరీ, గోవిందస్వామి, రవి, నాగలక్ష్మి, నాగమణి, మూర్తి, మౌనిక, శ్రీను, మనీ, శాంతమ్మ, బాలుచారి, ఎమ్ శివకుమార్, ఇంద్రమ్మ, సజ్జమ్మ, కాలప్ప, శివకుమార్, శ్రీను, సురేష్, విజయ సుమారు వంద మంది వివిధ పార్టీల నాయకులు డి. శ్యామ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డిచే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 26 బిసి కులాల విషయంలో రెండవ రోజు


# బీసీ కమిషన్ బహిరంగ విచారణ



**హైదరాబాద్, జూన్ 10, (తెలంగాణ దిశ) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ బీసీ కులాల జాబితా నుండి తొలగించబడిన 26 కులాలను తిరిగి చేర్చుకోవాలని వచ్చిన విజ్ఞప్తులపై తెలంగాణ బీసీ కమిషన్‌లో మంగళవారం రెండవ రోజు బహిరంగ విచారణ నిర్వహించారు. బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ విచారణలో పాల్గొన్నారు. ఈ బహిరంగ విచారణకు 56 ప్రతినిధుల బృందాలను కమిషన్ విచారించింది. ఇందులో గవర, తూర్పు కాపు, శెట్టిబలిజ నాగవంశం కొప్పుల వెలమ సంఘాల వారు కమిషన్ ముందు హాజరై తమ కులాలను తెలంగాణ బీసీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యులు పాత వెంకట సత్యనారాయణ కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ శెట్టిబలిజ కులం తరపున వాదనలు వినిపించారు. మరోవైపు తెలంగాణ బీసీ ఏ గ్రూపుకు చెందిన పలుకులాల ప్రతినిధులు తొలగించబడిన 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చుకోవద్దని కమిషన్ కు విజ్ఞప్తి చేశారు. కమిషన్ కార్యాలయంలో బుధవారం సైతం విచారణ కొనసాగుతుందని చైర్మన్ నిరంజన్ రెడ్డి తెలిపారు.



# ఇటీవలి వర్షాలకు విత్తు.. మొలకెత్తు



ఖమ్మం: ఖమ్మం గ్రామీణంలో ఇటీవలి వర్షాలకు మొలకెత్తిన పత్తి విత్తనాలు పొడి దుక్కుల్లో విత్తనాలు వేసిన రైతుల ఆశలు మొలకెత్తనున్నాయి. ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ ఆదివారం భారీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో పంట సాగుకు అనుకూలమైన తొలి వర్షమిదే. ఇటీవల దుక్కులు దున్ని పత్తి విత్తనాలు వేసిన రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. చెరువులు, కుంటల్లోకీ ప్రవాహాలు మొదలు కావడంతో సీజన్‌పై సానుకూల వాతావరణం నెలకొంది. వ్యవసాయ ప్రధానాధారమైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరి నార్లు పోసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరికొందరు అదును లేదని ఇంకా పత్తి విత్తనాలు వేయలేదు.

# ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై నిర్లక్ష్యం..!




భీమవరం: అన్ని పట్టణాలకు విడతల వారీగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తోంది. వీటిని సకాలంలో ఖర్చు చేయాల్సిన బాధ్యత పురపాలక సంఘాలదే. ఇప్పటికే ఆయా పట్టణాలకు విడుదలైన నిధులతో చేపట్టిన పనులు పూర్తి చేయలేదు. అయిదేళ్లపాటు కొనసాగే ఆర్థిక సంఘం ముగిసే వరకు సద్వినియోగం చేయరు. ఆఖరిలో హడావుడిగా చేపట్టి మధ్యలో వదిలేస్తారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులదీ ఇదే పరిస్థితి. తాడేపల్లిగూడెంలో వ్యర్థాల బదిలీ కేంద్రాలను నాలుగు చోట్ల నిర్మించాలని నిర్ణయించారు. రెండు చోట్ల పనులు ప్రారంభించగా అసంపూర్తిగా మిగిలాయి. పట్టణంలో నిత్యం సేకరించే చెత్తను ఈ కేంద్రాల ద్వారా తడి, పొడిగా వేరుచేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్న లక్ష్యం చెత్తలో కలిసింది. 2020-21 నుంచి ప్రారంభమైన 15వ ఆర్థిక సంఘం నిధులు ఇప్పటికి మూడు విడతలుగా ఆయా పురపాలికల బ్యాంకు ఖాతాల్లోకి చేరాయి. వీటిలో 40 శాతం అన్‌టైడ్‌గా పట్టణంలో ఏవైనా అభివృద్ధి పనులకు ఉపయోగించవచ్చు. మిగిలిన నిధుల్లో నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణకు 30 శాతం చొప్పున ఉపయోగించాలి. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన నిధులతో చేయాల్సిన పనులు ఇంకా పూర్తికాలేదు. పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. డంపింగ్ యార్డులు లేవు. వ్యర్థాల నిర్వహణ కోసం గార్బేజ్ స్టేషన్లు అంటూ కొన్ని పట్టణాల్లో రూ.50లక్షలకు పైగా ఖర్చు చేసినా వాటిని పూర్తి చేయలేదు. పర్యవేక్షణ లేకపోవడంతో మురుగు, చెత్త తదితర సమస్యలు ప్రజలను ఏటా వెంటాడుతున్నాయి. భీమవరంలో శ్రీరామపురం నుంచి బలుసుమూడి మీదుగా భీమవరం మండలానికి వెళ్లే రహదారి ఇది. దీని అభివృద్ధికి ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. రూ.40 లక్షలతో తారుపొర వేయాల్సి ఉండగా ఆ పనులు చేపట్టలేదు. ఇప్పటికే గుంతల్లో రాళ్లు బంతుల్లా లేస్తున్నాయి.

# మద్యం దుకాణాల్లో నగదు రహిత విక్రయాలు..!



వీరవాసరం: దశలవారీగా మద్య నిషేధం అమలు చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన వైకాపా సర్కారు మాట తప్పింది. దశలవారీగా ధరలు పెంచుతూ మద్యంలో నాణ్యత తగ్గిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతూ వచ్చింది. మద్యం తయారీ సంస్థల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న బ్రాండ్లే ఎక్కువ. ఓవైపు నగదు రహిత సేవలు మాత్రమే చేయాలంటున్న అధికారులు అదే క్రమంలో కొనుగోళ్లు మాత్రం తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూపర్‌వైజర్లు, సేల్స్‌మ్యాన్లకు ఆదేశాలు ఇవ్వడంతో ఏం చేయాలో దిక్కుతోచడం లేదని వారంతా వాపోతున్నారు. అయిదేళ్ల పాలనలో మద్యనిషేధం అమలు చేయకపోగా కూలీలు, నిరుపేదల ఉసురు తీసింది. తాజాగా మద్యం దుకాణాల్లో నగదు రహిత సేవలు ప్రారంభించింది. దీంతో రెండు రోజులుగా యూపీఐ సేవలు తెలియని కూలీలు బ్లాక్‌లోమద్యం కొనుగోలు చేసి మరింత నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏటా సుమారు రూ.1,500 కోట్ల మద్యం విక్రయాలు జరుగుతుంటాయి. ఇందులో ఊరూ పేరూ తెలియని మద్యంతయారీ సంస్థల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న బ్రాండ్లే ఎక్కువ. ఓ వైపు నగదు రహిత సేవలు మాత్రమే చేయాలంటున్న అధికారులు అదే క్రమంలో కొనుగోళ్లు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూపర్‌వైజర్లు, దుకాణాల వద్ద క్వార్టర్ సీసాలు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమ మద్యం వ్యాపారం చేసే వారికి రెండు రోజులుగా కాసుల వర్షం కురుస్తోంది.

# పట్టణ పారిశుద్ధ్యం మెరుగుపడేదెట్లా...?

మహబూబాబాద్: ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మహబూబాబాద్ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు పడడంలేదు. అరకొరగా ఉన్న పారిశుద్ధ్య సిబ్బందితో కేవలం ప్రధాన రహదారులు, మురుగు కాలువలు శుభ్రం చేస్తున్నారు. శివారు కాలనీల్లో మాత్రం కొంతమంది సిబ్బంది పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య పనులు నిర్వహించలేక పోతున్నారు. అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడం, మురుగు కాలువలు లేక రహదారులపై నీరు ప్రవహిస్తుండడంతో ఆయా ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంది. వానాకాలం ప్రారంభం కావడంతో పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజలకు అనారోగ్య సమస్యల ఎదురయ్యే అవకాశం ఉంది. ఇటీవల పురపాలక సంఘం అధికారులు పారిశుద్ధ్యం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నారు. 16 మందితో రెండు బృందాలను ఏర్పాటు చేసి వార్డులవారీగా ఇద్దరు చొప్పున పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. సిబ్బంది కొరత, అత్యవసరమైన పరికరాలు మూలన పడి ఉండడంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు వేగంగా ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు ఏ ప్రాంతంలోనూ ఫాగింగ్ చేయలేదు. పురపాలక సంఘంలో ఆరు ఫాగింగ్ మిషన్లు ఉండగా పని చేయకుండా మూలన పడేశారు. ఏ వార్డుకు ఆ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. మహబూబాబాద్ పట్టణంలోని హన్మంతుని గడ్డ, గోగుల మల్లయ్య బజార్ ప్రాంతం నిత్యం వాహనాలు, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశం చెత్త చెదారంతో అపరిశుభ్రంగా మారింది. మురుగు కాలువ నిండిపోయి ఈ నీరు అంతా రహదారిపైకి వచ్చి మురికి కూపంగా దీంతో దీంతో పందులు సంచరిస్తూ ఆ ప్రాంతాన్ని మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. పురపాలక సంఘంలో 27ఆటోలు, 9 ట్రాక్టర్ల ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారు.

# పడకలు.. పరికరాలు.. ప్లాంటు ఎప్పుడో?

ధర్మపురి: ఓ వైపు ప్రముఖ పుణ్యక్షేత్రం, మరోవైపు నియోజకవర్గ కేంద్రం కావడంతో.. ప్రభుత్వం ధర్మపురిలో అత్యాధునిక వైద్య సేవలందించేందుకు ప్రాధాన్యత ఇస్తుంది. అయితే ఆసుపత్రిలోని సేవలపై నిఘా లేకపోవడంతో సిబ్బంది మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీలు చేసినా.. మార్పు లేదు. ప్రభుత్వం మాతాశిశు కేంద్రం నిర్మించినా.. వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడంతో సేవలు అందుబాటులోకి రాలేదు. ఇక్కడి సామాజిక ఆసుపత్రిలో గతేడాది 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినా.. అత్యవసర సేవలు ఏమాత్రం ఉండటం లేదు. కుక్కకాటు, కోతులు దాడిచేసినా.. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి వెళ్తున్నారు. కనీసం ఎక్స్‌రేప్లాంటు, గర్భిణుల పరీక్షలకు సంబంధించిన పరికరాలు లేవని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ వైద్యులతో కలిసి 53మంది పనిచేయాల్సి ఉండగా.. 20 మంది మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు చెబుతున్నారు. రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న ఆసుపత్రి మూడో అంతస్తు భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరోనా సమయంలో సుమారు రూ.కోటి వ్యయంతో ఏర్పాటుచేసిన ఆక్సిజన్ ప్లాంటును గతేడాది ప్రారంభించినా.. సాంకేతిక లోపంతో పనిచేయడంలేదు. ఈ ఆసుపత్రి పరిధిలో ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, బీర్‌పూర్ మండలాలుండగా.. నిత్యం 150 మంది ఓపీ రోగులు వస్తుంటారు. గతేడాది 10 ఐసీయూ బెడ్ల ప్లాంటును ధర్మపురి ఆసుపత్రికి మంజూరు చేశారు. ఇది ప్రతిపాదనల్లోనే ఉంది. రోగులకు రోజూ అందించే భోజనం నాసిరకంగానే ఉంటోందని రోగులు వాపోతున్నారు. పారిశుద్ధ్యం కూడా అధ్వాన్నంగానే ఉంటోందని.. మధ్యాహ్నం వేళ వైద్యులు అందుబాటులో ఉండటంలేదని బాధితులు చెబుతున్నారు. ఆసుపత్రి



సేవలపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ధర్మపురిలో గత ప్రభుత్వ హయాంలో రూ. 8.50 కోట్లతో నిర్మించిన మాతాశిశు ఆసుపత్రి కేంద్ర భవన సేవలు అందుబాటులోకి రాలేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆదరబాదరాగా అక్టోబర్‌లో అప్పటి మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. రెండు నెలల్లో మిగతా పనులు పూర్తిచేసి సేవలను అందుబాటులోకి తీసుకుని వస్తామని ప్రకటించినా.. ఇప్పటివరకు అతీగతి లేదు. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషిచేస్తాం. ప్రస్తుతం వైద్యుల కొరత అంతగా లేదు. సిబ్బందిని కూడా నియమించాం. పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాం. వైద్యులు నిర్ణీత సమయం ప్రకారం ఉండేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఐసీయూ కేంద్రానికి కావాల్సిన పరికరాలు రావాల్సి ఉంది. మాతాశిశు ఆసుపత్రికి సిబ్బందిని నియమించలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళుతాం.

# అవార్డులు సరే... ప్రోత్సాహక నిధులేవి?



వేములవాడ: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక వైద్య సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందింది. వైద్యులు కూడా వివిధ రకాల శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు రోజూ వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. వీటన్నింటి ఫలితంగా వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో మూడేళ్లుగా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును సొంతం చేసుకుంది. రాష్ట్రంలో దాదాపు వంద ఆసుపత్రులు ఉండగా మూడంచెల విధానంలో ఏటా ఈ అవార్డును సొంతం చేసుకోవడం గమనార్హం. అయితే ఈ అవార్డుకు సంబంధించిన నిధులు రాకపోవడం సిబ్బందిని నిరుత్సాహపరుస్తుంది. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని ఆధునిక హంగులతో నిర్మించారు. వంద పడకలు ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. సాధారణ శస్త్రచికిత్సలతోపాటు నేత్ర,ఆర్థో, మోకీళ్ల మార్పిడి, కాన్పులు, గర్భసంచిలోగడ్డలతొలగింపు తదితర శస్త్ర చికిత్సలు రోజూజరుగుతుంటాయి.24 గంటల్లో 23 వివిధ శస్త్ర చికిత్సలు నిర్వహించి ఆసుపత్రి వైద్యులు రికార్డు నెలకొల్పారు. ఐపీ నెలకు దాదాపు 10 వేల వరకు ఉంటుంది. ఆసుపత్రిఅభివృద్ధికి ఉపయోగపడతాయి ఆసుపత్రి ఏటా కాయకల్ప అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కానీ అవార్డుకు ప్రకటించిన ప్రోత్సాహక నిధులు మాత్రం రావడం లేదు. నిధులు విడుదలైతే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు అవకాశం ఉంది. కాయకల్ప అవార్డు ఎంపికకు బృందం సభ్యులు మూడంచెల విధానంలో పరిశీలిస్తారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, పరిసరాల నిర్వహణ, పరిశుభ్రత, వ్యర్థాల సేకరణ, సిబ్బంది పని తీరు, విద్యుత్తు వినియోగం, పచ్చదనానికి ప్రాధాన్యం వంటి అంశాలను పరిశీలనకు తీసుకుని మార్కులు వేసి నివేదిక ఇస్తారు. ఈ నివేదిక ఆధారం గా అవార్డుకు ఎంపిక చేస్తారు. వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిని రాష్ట్ర బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీల్లో వచ్చిన మార్కుల ఆధారంగా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది.అవార్డుకు ఎంపిక కావడంతో నగదు ప్రోత్సాహకం రూ.15 లక్షలు ప్రకటించింది. మూడేళ్లుగా కాయకల్ప అవార్డుకు ఎంపికైనా ప్రభుత్వం ప్రకటించిన నిధులు మాత్రం రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విడుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

## మేల్కొంటేనే పచ్చదనం!

# మొక్కల పెంపకం లక్ష్యం ఖరారు


పెద్దపల్లి:అటవీ విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఏటా ఆర్భాటంగా లక్షల్లో మొక్కలు నాటుతున్నా.. సంరక్షణను గాలికొదిలేస్తున్నారు. రూ.కోట్ల నిధులు ఖర్చైనప్పటికీ ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. 2025-26 ఏడాదికి సంబంధించి మొక్కల పెంపకం లక్ష్యాన్ని నిర్ణయించారు. విత్తన దశలోనే నిర్లక్ష్యం నెలకొంది. నర్సరీల్లో మౌలిక వసతులు కొరవడి వేసవి ఎండ వేడిమి తట్టుకోలేక ఎండిపోతున్నాయి. గత అడ్డంకులు అధిగమిస్తేనే హరిత కల ఫలించనుంది. మొక్కల కొరత లేకుండా ఊరికొక నర్సరీ ఉంది. అక్కడ నీడ కోసం పైకప్పు ఏర్పాటు చేయడం లేదు. చుట్టూ కంచె లేక మొక్కలు పశువులకు మేతగా మారుతున్నాయి. బోరు వసతి కొరవడటంతో మొక్కలు నీరందడం లేదు. నాణ్యమైన విత్తనాలు కాకపోవడంతో సంచుల్లో చనిపోతున్నాయి. గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు నాటగా ప్రస్తుతం వన మహోత్సవం పేరిట ఈ కార్యక్రమం అమలవుతోంది. ః నర్సరీల్లో సీతాఫలం, నిమ్మ, బత్తాయి, జామ, అల్లనేరడి, జామ, చింత, మల్లె, జాజిమల్లె ఇలా.. పూలు, నీడనిచ్చె తదితర మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.నర్సరీల్లో విత్తనం విత్తిన నుంచి మూడేళ్లలోపు నిర్వహణ కోసం ఉపాధిహామీ నిధులు కేటాయిస్తున్నారు. నర్సరీల్లో సంచుల్లో నింపి విత్తనాలు, విత్తడం సుమారు 2 మీటర్ల ఎత్తు మొక్క ఎదిగే వరకు ఒక్కోదానికి రూ.114, నాటిన మొక్క రక్షణకు ముళ్లచెట్లతో రక్షణ కంచె (పెన్సింగ్)కు



రూ.190, మరో రెండేళ్ల నిర్వహణకు రూ.126 ఇలా మొత్తం ఒక్కో మొక్కకు రూ.430 ఖర్చవుతోంది. వచ్చే ఏడాది 16.34 మొక్కలు నాటాలని లక్ష్యం విధించారు. పది శాతం అదనంగా నర్సరీల్లో 20.69 లక్షల మొక్కలు సిద్ధం చేయాలని ఆదేశించారు. నర్సరీల్లో ప్రతి మొక్క మూడు మీటర్ల వరకు ఎత్తు ఎదగాలి. విత్తణాల్లో నాణ్యత లేమి, నీళ్ల సమస్య, షేడ్ నెట్‌లతో నీడ అందివ్వకపోవడం వంటి కారణాలతో మొక్కలు ఆశించిన మేర ఎదగడం లేదు. విత్తన దశలోనే మేల్కొంటేనే వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం అవుతోంది. ఆ దిశగా అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సి ఉంది.

## ఎక్కడి దస్త్రం అక్కడే-

# అస్తవ్యస్తంగా రెవెన్యూ విభాగం



కరీంనగర్ :కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగం గాడీ తప్పింది. పన్నుల వసూలు, కొత్త ఇంటి నంబర్ల కేటాయింపు, వాణిజ్య భవనాల రీఅసెస్‌మెంట్ పనులు మినహాయిస్తే మిగతా దస్త్రాలన్నీ పెండింగ్‌లో ఉంటున్నట్లుగా ఫిర్యాదులు వస్తున్నాయి. క్షేత్రస్థాయి నుంచి విభాగం అధికారి వరకు దస్త్రం పెండింగ్‌లోనే లేదని దాటేస్తుండగా దర ఖాస్తుదారులు మాత్రం పనులు చేయాలని కార్పొరేటర్ల చుట్టూ తిరుగుతున్నారు. రెవెన్యూ విభాగంలో బిల్ కలెక్టర్లతోపాటు నలుగురు రెవెన్యూ అధికారులు(ఆర్.ఐ), ఒక ఆర్వో ఉన్నారు. పేరుమార్పిడి, పన్ను మదింపు వంటి అర్జీలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా ఇటీవల నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నట్లు తెలుస్తోంది. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేరుమార్పిడి, ఇతరత్రా పనుల కోసం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతోపాటు అవసరమైన కాగితాలతో దరఖాస్తు చేసుకుంటున్నారు. ఎక్కడ లేని నిబంధనలు జత చేసి, లేని కాగితాలు తీసుకు రావాలని ఆదేశిస్తుండటం, కొర్రీలతో అర్జీదారులు నానావస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక కొందరు అడ్డదారుల్లో వచ్చి ఎంతో కొంత ముట్టజెప్పి పనులు చేసుకుంటున్నారు. పైసలు ఇవ్వనిదే దస్త్రాలు కదలడం లేదని పలువురు పాలకవర్గ సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. తీగలగుట్టపల్లి ప్రాంతవాసి ఇంటినంబర్ కోసం దరఖాస్తు చేశారు. దీనికి కావాల్సిన దరఖాస్తుతోపాటు రిజిస్ట్రేషన్ దస్తావేజులు జత చేశారు. నిబంధనల ప్రకారం అంటూ ఆ దస్త్రాన్ని న్యాయ సలహా కోసం పంపించారు. దీనికి స్టాంపు డ్యూటీ రూ.40 వేలు చెల్లించాల్సి ఉంటుందని న్యాయ సలహాదారు చెప్పడంతో దరఖాస్తుదారు వెనక్కి తగ్గారు. లింకు కాగితాలు, రిజిస్ట్రేషన్ పక్కాగా ఉండగా కొర్రీ పెట్టడంలో మతలబు ఏమిటో తెలియక ఆ దస్త్రాన్ని అలాగే రెవెన్యూ విభాగంలో ఉంచారు. కమాన్ రోడ్డులో పేరు మార్పిడి చేసుకోగా బైఫరికేషన్ నంబర్ కోసం ఒకరు దరఖాస్తు చేశారు. ఒకరిపైనే పన్ను భారం పడుతుండగా కొనుగోలుదారుకు నంబర్ ఇవ్వాల్సి ఉండగా 9 నెలలుగా తిప్పుతున్నారు. దేనికోసం ఇబ్బందులు పెడుతున్నారని నిలదీసినా అధికారుల దగ్గరి నుంచి సమాధానంలేదని దరఖాస్తుదారు అంటున్నారు. బుట్టిరాజారాం కాలనీకి చెందిన ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత పేరు మార్పిడికి 3 నెలల కిందట దరఖాస్తు చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ అధికారి పరిశీలించాల్సి ఉండగా.. వెళ్లడంలేదు. ఉస్మాన్‌పురకు చెందిన ఒక ఇంటి యజమాని పేరు మార్పిడి చేసుకున్నారు. బై ఇంటి నంబర్ ఇచ్చేందుకు ఆర్ఐ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూడు నెలలుగా ఇంటి నంబర్ మాత్రం రావడంలేదు. ఎందుకు జాప్యం అవుతుందని పేర్కొన్నా సమాధానం దాటేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

# అక్కరకు రాని ఘన వ్యర్థాల సేకరణ కేంద్రాలు

కొత్తగూడెం:పాతకొత్తగూడెం, బూడిదగడ్డ ఏరియాల్లో నాలుగేళ్ల క్రితం ఘన వ్యర్థాల సేకరణ కేంద్రాలను (డీఆర్‌సీసీ) అం దుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కోదాని ఏర్పాటుకు రూ.36 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటిల్లో పొడి (ఘన వ్యర్థాలు) చెత్తను వేరుచేసి విక్రయించడం, తడి వ్యర్థాలను వర్మి కంపోస్టుగా తయారు చేసి విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 16.10 చదరపు కిలో మీటర్లు విస్తరించి ఉన్న ప్రథమశ్రేణి 'గూడెం' పురపాలకంలో 36 వార్డులున్నాయి. ప్రతి వార్డు నుంచి 'స్వచ్ఛ ఆటో'లో ఇంటింటికి చెత్త సేకరిస్తున్నారు. రోజుకు 30 నుంచి 40 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తవుతోంది. డంపింగ్ యార్డులతో పాటు డీఆర్‌సీసీ కేంద్రాలకు సుమారు 18 నుంచి 24 మెట్రిక్ టన్నుల పొడి చెత్త, 14మెట్రిక్ టన్నుల తడి చెత్తను తరలిస్తున్నారు. అధికారుల అంచనా ప్రకారం 8 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు వెలువడుతున్నాయి. స్వచ్ఛ ఆటో కార్మికులు సేకరించే ఘన వ్యర్థాలు కిలోకు కేంద్రం వారు రూ.5 చెల్లిస్తున్నారు. తిరిగి దుకాణాలకు రెండు, మూడు రెట్లకు విక్రయిస్తున్నారు. సేకరించిన వ్యర్థాలు,ఆదాయం తాలూకు లెక్కాపత్రాల్లేకపోవడంతో నిర్వా హక సిబ్బంది పురపాలక ఖజానాకు చిల్లులు పొడుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. "తడి, పొడి చెత్తను వేరు చేసి ఇచ్చిన ట్రాలీల కార్మికులకు డీఆర్‌సీసీల్లో మార్కెట్ ధరనే చెల్లిస్తున్నారు. డీఆర్‌సీసీ కేంద్రాల్లో ఏ రోజుకారోజు ప్లాస్టిక్,



ఘనవ్యర్థాలను సేకరించి మార్కెట్ రేటుకు విక్రయిం చడం ద్వారా పురపాలకానికి ఆదాయాన్ని పెంచాలి. తడి చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేయాలి. కానీ, అక్కడి కంపోస్టు బెడ్లు చాలా వరకు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కేవలం రెండు, మూడింట్లో మా త్రమే వర్మికం పోస్టు తయారు చేస్తున్నారు. పట్టణ స్వచ్ఛతతో పాటు పురపాలకానికి ఆదాయ వనరుగా మారాల్సిన కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఆదాయ వివరాలను పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా డీఆర్‌సీసీలను గాడిలో పెట్టి మరికొందరికి ఉపాధి కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

# సమగ్ర కులగణనకు కసరత్తు



నల్గొండ: సమగ్ర కులగణన చేపట్టేందుకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఒకట్రెండు రోజుల్లో మార్గదర్శకాలు వెలువడనున్నాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ భారీ క్రతువును రెండు నెలల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తోంది. ఈ దిశగా మూడు జిల్లాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సిబ్బందిని కార్యోన్ముఖులను చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ సమయంలో గత భారాస ప్రభుత్వం 2014లో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది. జనాభా దామాషా ప్రకారం ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఉండాలని గత కొన్నాళ్ల నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో పదేళ్ల అనంతరం మరోసారి సమగ్ర కులగణన చేపట్టనుండటం విశేషం. కులగణనలో క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి కుటుంబం కులంతో పాటు వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులు, విద్యా, ఉద్యోగం తదితర పరిస్థితులను సేకరించనున్నారు. వీటన్నింటినీ క్రోడీకరించి సమగ్ర నివేదికను జిల్లాల వారీగా ప్రభుత్వానికి నివేదించనున్నారు. బీసీల్లోని ఉపకులాలను సైతం ఈ సర్వేలో పొందుపరచనున్నారు. దీని ద్వారానే రానున్న పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీల కోటాను నిర్ధారించనున్నారు. ప్రస్తుతం మూడు జిల్లాల్లోనూ మొత్తం జనాభాలో సుమారు 52 శాతం బీసీ జనాభా ఉంది. ఉమ్మడి జిల్లాలో అనాదిగా ఆధిపత్య వర్గాల అండ లేకపోవడంతో బీసీలకు రాజకీయంగా సరైన ప్రాధాన్యం దక్కడం లేదని ఏళ్ల నుంచి ఆయా సంఘాలు విమర్శిస్తున్నాయి. ఈ సర్వే ద్వారా బీసీ లెక్క తేలితే దా ని ఆధారంగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. నోడల్ ఏజెన్సీగా ఉన్న ప్రణాళిక శాఖలో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఈ సర్వే జరిగే రెండు నెలల పాటు ఇతర శాఖల నుంచి పలువురిని డిప్యుటేషన్ మీద తీసుకోనున్నట్లు తెలిసింది. సర్కారు నుంచి మార్గదర్శకాలు విడుదలైన వెంటనే క్షేత్రస్థాయిలో పని మొదలుపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు ఆదేశాలు అందాయి. ఈ నేపథ్యంలో ఒకట్రెండు రోజుల్లో దీనిపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

# యాసంగి పంట ప్రణాళిక ఖరారు


నల్గొండ :నల్గొండ జిల్లాలో యాసంగి పంటల సాగునకు సంబంధించి వ్యవసాయశాఖ కార్యాచరణ ప్రణాళిక ఖరారు చేసింది. 2024-25లో 5,83,620 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అంచనా వేసింది. ఈ మేరకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచింది. జిల్లాలో 90 శాతం చెరువులు, సాగర్, మూసీ, జలాశయాలు వర్షాకాలంలో పూర్తిగా నిండాయి. ఈ నేపథ్యంలో భూగర్భ జలమట్టం పెరిగింది. బోర్లు, బావుల్లో సాగుకు సరిపోను నీరు లభిస్తుంది. ఈ సందర్భంగా ఏ మండలంలో ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేస్తారనే విషయంలో నిర్దేశిత లక్ష్యాన్ని అధికారులు రూపొం దించారు. ఎక్కువగా సాగు చేసే వరితో పాటు వేరుశనగ, మినుము, పెసర, ఆముదం, జొన్న, సజ్జ విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇంత వరకు ప్రకటించలేదు. దీంతో ప్రయివేటు వ్యాపారుల వద్ద కొనాల్సి వస్తోంది. వారు ఇష్టం వచ్చిన ధరకు విక్రయించే అవకాశం ఉంది. జిల్లాలో సాగుకు భూములు అనుకూలంగా మారాయి. ప్రాజెక్టుల, బోరు బావుల కింద వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. అధికారులు మాత్రం ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచనలు చేస్తున్నారు. నల్గొండ నియోజకవర్గంలోనే ముందస్తుగా



వానాకాలం వరి కోతలు ప్రారంభించారు. మిగిలిన నియోజకవర్గాల్లో నవంబరు, డిసెం బరులో వరి కోతలు మొదలవుతాయి. ఎక్కడ ముందస్తుగా కోతలు మొదలవుతాయో అక్కడ విత్తనాలు సిద్ధంగా ఉంచేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు. యాసంగిలో పంటల సాగుకు అనుకూల వాతావరణం ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతో బోర్లు, బావుల్లో నీటి మట్టాలు పెరిగాయి. అన్ని రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి.

## ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం!

# మూతపడిన స్టీల్ బ్యాంకు పథకం




జనగామ:పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, పట్టణ పేద మహిళలకు ఉపాధి మార్గం చూపించే ఆశయంతో ప్రారంభించిన ఓ పథకం మూలకు చేరింది. పట్టణ మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా ఆధ్వర్యంలో వారి సొంత, కొత్త వ్యాపారాలకు రుణాలిస్తున్నారు. ఇటు ఆదాయం, అటు పర్యావరణానికి హితంగా ఉండేలా ప్రారంభించిన 'స్టీల్ బ్యాంకు' పథకం ఉమ్మడి జిల్లాలో ఆచరణలో విఫలమైంది. పట్టణ ప్రాంతాలకు సమస్యగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నిషేధాజ్ఞలు విధించి జరిమానాలు వడ్డిస్తున్నారు. విందులు, ప్రత్యేక సందర్భాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వాడకం ద్వారా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పోగవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఉభయతారకంగా ఉండేలా 'స్టీల్‌బ్యాంకు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలోనే గతంలో మాదిరిగా స్టీలు, ఇండాలియం(అల్యూమినియం) గిన్నెలు, కంచాలు, గ్లాసుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు దీనిని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక వేడుకలో 8కిలోల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని పరిగనలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సర్వే సంస్థల నుంచి ప్రశంసలు సైతం దక్కాయి. జనగామ పరిధిలో మహమ్మద్ స్లమ్‌లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్మద, రజియాలు 17 రకాల వస్తువులతో స్టీల్ బ్యాంకును సెప్టెంబరు 2023లో ప్రారంభించారు. మున్సిపాలిటీ, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి, మెప్మా సంఘాల నుంచి సహకారం అందలేదు. రవాణా, కూలీలకు చెల్లింపులు భారమయ్యాయి. దీంతో ఒకటి రెండు వేడుకలకు మినహా స్టీల్ సామగ్రిని సరఫరా చేయలేకపోయారు. రుణ భారం మీదపడింది. జయశంకర్ భూపాలపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించలేదు. మహబూబా బాద్‌లో కొన్నాళ్లపాటు నడిచినా ప్రస్తుతం మనుగడలో లేదు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో కాజీపేట బ్యాంకు సామగ్రిని క్యాంటీన్ నిర్వహణలో వాడుతున్నారు.కొత్త వ్యాపారాలకు రుణాలిస్తున్నారు. ఇటు ఆదాయం, అటు పర్యావరణానికి హితంగా ఉండేలా ప్రారంభించిన 'స్టీల్ బ్యాంకు' పథకం ఉమ్మడి జిల్లాలో ఆచరణలో విఫలమైంది. పట్టణ ప్రాంతాలకు సమస్యగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నిషేధాజ్ఞలు విధించి జరిమానాలు వడ్డిస్తున్నారు. విందులు, ప్రత్యేక సందర్భాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వాడకం ద్వారా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పోగవుతున్నాయి. మరో రెండు చోట్ల ఖాయిలా పడ్డాయి. పట్టణ సమాఖ్య నుంచి, రూ. 1.50 లక్షలు రుణం తీసుకుని కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఆశించిన సహకారం లేదు. దీంతో నిర్వహణ భారమైంది. ఆదాయం లేకున్నా, నెలనెలా వడ్డీతో పాటు కిస్తీ చెల్లించాల్సి వస్తోంది.

రుణం రద్దు చేసి ఆదుకోవాలని జనగామ స్టీల్‌బ్యాంకు నిర్వాహకురాలు నర్మద తెలిపారు.ఆశించిన మేర సులభతర సేవలకు అవకాశం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇతర జిల్లాల్లో మాదిరి ఇక్కడా నిరుపయోగంగా ఉన్న స్టీల్ బ్యాంకు సామగ్రిని మహిళా శక్తి క్యాంటీన్‌కు సరఫరా చేసే అవకాశాన్ని కల్పించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని జనగామ మెప్మా పీడీ హర్షవర్ధన్ వివరించారు.ఇలా ప్రారంభమైంది.. మహాత్మా గాంధీజాతీయ నిధి(ఎంజీఎన్ఎఫ్) ఆధ్వర్యంలోరాష్ట్రంలో పురపాలికలున్న జిల్లా కేంద్రాల్లో స్టీలు సామగ్రి(స్టీల్ బర్తన్) బ్యాంకులను ఏర్పాటు చేశారు. మొదటి దశలో రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు పెట్టుబడిని రుణ రూపేణ సమకూర్చారు.. ఇందులో భాగంగా గత సంవత్సరంజనగామ, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని పురపాలికల్లో ఒక్కొక్కటి,వరంగల్,హనుమకొండ జిల్లాల పరిధిలో మూడు బ్యాంకులను ప్రారంభించారు. నిర్వహణకు ఆసక్తి కలిగిన మహిళా సంఘాలను ఎంపిక చేసి, తక్కువ వడ్డీకి రుణం మంజూరు చేశారు.

# కంటి చూపు కాపాడే లయన్స్

మిర్యాలగూడ: ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి శస్త్ర చికిత్స చేయించుకునే స్తోమత లేని పేదలు.. మధ్య తరగతి వారెందరో కంటి సమస్యలతో బాధపడుతున్నారు. ప్రైవేటులో రూ.వేలల్లో ఫీజులు చెల్లించలేక, వైద్యంపై నమ్మకం లేక.. అలాగే ఉండిపోతున్నారు. అలాంటి వారికి మేమున్నామంటూ కంటిచూపును ప్రసాదిస్తోంది.. 'టీకేవీ రంగాచార్యులు-రంగనాయకమ్మ మెమోరియల్ లయన్స్ కంటి ఆసుపత్రి'. టీకేవీ రంగాచార్యులు-రంగనాయకమ్మలు మిర్యాలగూడలోని నల్గొండ రహదారిలో తమకున్న రూ.కోట్ల విలువైన సుమారు 3,400 గజాల స్థలాన్ని ఆసుపత్రి నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. అప్పటి లయన్స్ క్లబ్ ప్రతినిధులు ముడుంబై రామానుజాచార్యులు, ముక్కపాటి వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి తదితరుల శ్రమ, దాతల సహకారంతో రూ.1.50 కోట్ల వ్యయంతో ఆసుపత్రి భవనం నిర్మించి, 2017 అక్టోబరులో సేవలు ప్రారంభించారు. దీన్ని మరో రూ.20 లక్షలతో ఇటీవల విస్తరించి శుక్రవారం ప్రారంభించారు. వేసవి అనంతరం కంటి శస్త్ర చికిత్సలనూ మొదలుపెట్టారు. 'సమష్టి కృషితో, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, దాతల చేయూతతో సేవలందిస్తున్నామ'ని ఆసుపత్రి, ట్రస్టు కార్యదర్శి ముక్కపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సుమారు 48 వేల మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా.. మరో 4,200 మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేశారు. ఏటా వేసవిలో మూడు నెలల పాటు శస్త్ర చికిత్సలు నిలిపివేస్తారు. ప్రతి గురువారం 22 మందికి నల్గొండకు చెందిన డాక్టర్ పుల్లారావు




ఆధ్వర్యంలో ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి.. మరుసటి రోజు అద్దాలు, మందులు ఇస్తారు. శస్త్ర చికిత్సలకు ముందు రక్తపోటు, మధుమేహ పరీక్షలు కూడా ఉచితమే. ఆ ఆసుపత్రికి మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, దేవరకొండ, నల్గొండ, నాగార్జునసాగర్, చౌటుప్పల్ ప్రాంతాలతో పాటు ఏపీలోని సరిహద్దు గ్రామాల నుంచి సైతం అనేక మంది వస్తుంటారు. ఆధార్, రేషన్‌కార్డు, ఫొటోలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించి.. డాక్టర్ రాజు ఆధ్వర్యంలో సాధారణ పరీక్షలు, క్రాంతి, సంతోష్ ఆధ్వర్యంలో పరీక్షల అనంతరం శస్త్ర చికిత్సలకు పంపిస్తారు. 2018లో కుడి కంటిలో శుక్లాలు రాగా.. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తే రూ. 40 వేల వరకు ఖర్చువుతాయన్నారు. ఇరుగు పొరుగు వారి సూచనతో మిర్యాలగూడలోని లయన్స్ ఆసుపత్రికి వెళ్తే ఉచితంగా శస్త్ర చికిత్స చేసి అద్దాలు ఇచ్చారు. ఈ ఆసుపత్రి వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతోంది.

# స్వచ్ఛత ఇంకెంత దూరం?

## ఇంటింటా చెత్త సేకరణకు వాహనాలు, సిబ్బంది కొరత

ఇచ్ఛాపురం, శ్రీకాకుళం :జిల్లాలోని నగర, పురపాలికలు స్వచ్ఛ ప్రాంతాలుగా మార్చాలంటే ప్రభుత్వానికి ఇంకా చాలా చిత్తశుద్ధి అవసరం. శ్రీకాకుళం నగరపాలిక, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం పురపాలికల్లో రోజుకు 126 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో 110 టన్నుల చెత్త సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. అయినా చాలా ప్రాంతాల్లో చెత్త కన్పిస్తోంది. సేకరించిన చెత్తను పూర్తిస్థాయిలో ప్రాసెస్ చేసేందుకు అనుకూలంగా డంపింగ్‌యార్డులను నవీకరించాల్సి ఉంది. యార్డుకు చేరిన చెత్తను విభజించి, కుండీలు, చప్టాల ద్వారా ఎరు వుగా మార్చేందుకు ఇంకా నిర్మాణాలు, వసతులు సమకూర్చాల్సి ఉంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తి స్థాయిలో సేకరించి, మొత్తాన్నీ విశాఖపట్నం విద్యుదుత్పత్తి కేంద్రానికి పంపించాల్సి ఉండగా ఇందుకూ వాహనాల కొరత ఉంది. ఇచ్ఛాపురాన్నే తీసుకుంటే ఇక్కడ రోజుకు టన్ను పాలిథిన్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. అంటే వారానికి ఏడు టన్నులు కాగా పూర్తి స్థాయిలో సేకరిస్తే ఇది పది టన్నులకుపైనే ఉంటుంది. ఇందులో నాలుగు టన్నులు మాత్రమే విశాఖపట్నానికి పంపిస్తున్నారు. దాదాపు అన్ని చోట్లా ఇదే సమస్య ఉంది. రీసైకిల్ కాని పాలిథిన్ వ్యర్థాలు ఇంకా పెద్దమొత్తంలో కనబడుతున్నాయి. వీటి నిషేధాన్ని కఠినంగా అమలు చేయాల్సి ఉంది. కాలువలు, రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వీటిని పడేస్తుండటంతో ఇబ్బందిగా మారుతోంది. నేషనల్ గ్రీన్‌కోర్ ఆదేశాల మేరకు రిసైకిల్ అయ్యే ప్లాస్టిక్ విశాఖ ప



ట్నంకు తరలిస్తుండగా, రీసైకిల్ కాని ప్లాస్టిక్ ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోతోంది. శ్రీకాకుళం నగరం చాపురం ప్రాంతంలోని ఓ వీధిలో రహదారిపై చెత్త నగరంలో పారిశుద్ధ్యం కోసం నెలకు సుమారు రూ.65 లక్షలు ఖర్చుచేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య సిబ్బంది 500 మంది, రెగ్యులర్ సిబ్బంది 73 మంది ఉన్నారు. గతేడాది విలీన పంచాయతీలు నగరపాలికలో కలిసిపోవడంతో మరో 150 మంది సి బ్బంది అవసరముంది. అందుబాటులో 42వాహనాలుండగా మరో 15అవసర ముంది. ఇక్కడ సేకరిస్తున్న చెత్తలో 25-30 టన్నులు విశాఖపట్నంలోని ఎనర్జీ ప్లాంట్‌కు పంపిస్తున్నారు, 25 టన్నుల వరకు స్థానిక ఖాజీపేటలోని వర్మీ కంపోస్టుతయారీ, బయోగ్యాస్ ప్లాంట్‌లకు తరలిస్తున్నారు. చెత్త సంపదకేంద్ర పూర్తిస్థాయిలో చాలకపోవడంతో దాన్ని అభివృద్ధి చేస్తున్నారు. సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు లేఖ రాశామని, అనుమతి రాగానే ఒప్పంద ప్రాతిపదికన కార్మికులను నియమించేందు కు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు.

# బత్తాయి మార్కెట్‌లో దళారులదే రాజ్యం!



గుర్రంపోడు: హైదరాబాద్‌లోనే బత్తాయి పండ్ల మార్కెట్ ఉన్నప్పటికీ మార్కెట్‌లో ధరలపై అవగాహన లేని ఇక్కడి రైతులు తమ అమాయకత్వంతో దళారులనే నమ్ముతూ తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో బత్తాయి టన్ను ధర కనీసంగా రూ.30వేలు పలుకుతుండగా దళారులు రైతు వద్దకు వచ్చి టన్నుకు రూ.25వేలకే మాట్లాడుకుని లారీల్లో బత్తాయిని హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగుసోకిన కాయలకు రేటు మరింత తగ్గిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు వ్యాపారులు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి నేరుగా దిల్లీ మార్కెట్‌కు తరలించి రెట్టింపు లాభాలు ఆర్జిస్తున్నారు. ఏడాదిపాటు కష్టపడి దిగుబడి సాధించే రైతుల కష్టార్జితాన్ని గద్దొచ్చి కోడిపిల్లను ఎత్తుకు పోయినట్లుగా దళారులు వచ్చి నాలుగు రోజుల్లో రెట్టింపు లాభాలను పొందుతున్నారు. ఇది గత నాలుగు దశాబ్దాలుగా సాగుతున్నా ఎందరో ప్రజాప్రతినిధులు ప్రయత్నించినా ప్రయోజనం కనిపించటం లేదు. నాలుగేళ్ల క్రితం నాటి మంత్రి జగదీష్‌రెడ్డి సహకారంతో నల్గొండలో బత్తాయి మార్కెట్ ఏర్పాటు చేసినా వ్యాపారులు ఇక్కడికి రాకపోవటం, దళారులు మార్కెట్‌ను ఆక్రమించడం దీంతో రైతులు కూడా హైదరాబాద్‌కు వెళ్లటం తదితర కారణాలతో మూతపడింది. దీంతో పరిస్థితి మొదటికి వచ్చింది. 1980లో ఇక్కడ ప్రారంభమైన బత్తాయి సాగు రెండు దశాబ్దాల్లో విస్తీర్ణం గణనీయంగా పెరిగి 3లక్షల ఎకరాలకు చేరుకుంది. తిరిగి వివిధ రకాల తెగుళ్లతో తోటలు ఎండిపోయి చాలా వరకు విస్తీర్ణం పడిపోయింది. 2016లో లక్ష ఎకరాలకు తగ్గిన బత్తాయి 2023లో 42వేల ఎకరాలకు చేరుకుంది. దళారుల బెడదతో ఆదాయం మరింత తగ్గిపోవటంతో రైతులు బత్తాయి సాగును క్రమంగా తగ్గించుకుంటూ వస్తున్నారు. ఇలాగే కొనసాగితే మరికొన్ని ఏళ్లలో జిల్లాలో బత్తాయి సాగు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. బత్తాయి మార్కెట్‌లో దళారీ వ్యవస్థ పోతేనే రైతులకు లాభం జరుగుతుంది. సరిగ్గా అవగాహన లేకపోవటంతో రైతులు మార్కెట్‌కు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. రైతులకు దక్కాల్సిన లాభం దళారులే స్వాహా చేస్తున్నారు. దీంతో రైతు వ్యవస్థ కుదేలైపోతోంది. దీనికి ప్రభుత్వమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి. రైతులు తమ పంట దిగుబడులను పెంచుకునేందుకు సాగు మెళకువలతో పాటు తగిన ధరలకు బత్తాయిని అమ్ముకునేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. దళారులను నమ్మవద్దని చెబుతూనే ఉన్నాం. గత మార్చిలో సదస్సు నిర్వహించాం. ఎన్నికలు వచ్చినందున గ్యాప్ వచ్చింది. అలాంటి సదస్సులు త్వరలోనే ఏర్పాటు చేస్తాం.

# అక్రమ తవ్వకాలు అడ్డుకోలేరా..?

నరసరావుపేట:మట్టి మాఫియా స్వార్థానికి కొండలు కరిగిపోతున్నాయి. అక్రమంగా తవ్వకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. భారీయంత్రాలు పెట్టి రాత్రిపగలు తవ్వకాలు చేసి మట్టి తరలిస్తున్నారు. కొన్నాళ్లుగా నిరంతరాయంగా తవ్వకాలు జరుగుతుండటంతో కొండ ప్రాంతంలో భారీ గోతులు ఏర్పడి వర్షపునీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ప్రజా ప్రతినిధి అండతో ఇద్దరు అనుచరులు యథేచ్ఛగా కొండను తవ్వుతున్నారు. అధికార పార్టీ అండతో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి. భూగర్భగనులశాఖ నిఘా విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమ తవ్వకాలను నిర్ధారించి రూ.లక్షలు జరిమానా వేసినా తవ్వకాలు ఆగకపోవడం కొసమెరుపు. ఇదీ నకరికల్లు మండలం త్రిపురాపురం కొండలో అక్రమ తవ్వకాలు తీరు. నకరికల్లు మండలం త్రిపురాపురం కొండలో నాణ్యమైన గ్రావెల్ లభిస్తోంది. అద్దంకి-నార్కట్‌పల్లి రహదారికి సమీపంలోనే కొండ ఉండటం, మట్టి తవ్వకాల ప్రాంతం వరకు మార్గం ఉండటంతో భారీయంత్రాలు పెట్టి కొండను కొల్లగొడుతున్నారు. మండలానికి చెందిన ఇద్దరు స్థానిక అధికారపార్టీ నేతలు మట్టి తవ్వకాలు, తరలింపులో కీలకపాత్ర పోషిస్తున్నారు. మట్టితో వ్యాపారం చేస్తున్నారు. నరసరావుపేట పట్టణం పరిసరాల్లో ప్రైవేటు వెంచర్లు భారీగా రావడం వీరికి కలిసొచ్చింది. వెంచర్లలో రోడ్లు వేయడానికి లోతట్టు ప్రాంతాల్లో మట్టి పోసి చదును చేయడానికి వేల ట్రక్కుల మట్టి అవసరమ వుతోంది. ఇదే అదునుగా కొండను తవ్వి ప్రైవేటు వెంచర్లకు సరఫరా చేస్తున్నారు. రెవెన్యూ పోరంబోకు భూమి కింద కొండలో కొంత ప్రాంతం ఉండటంతో అక్కడ తవ్వుతున్నారు. ఇక్కడ మట్టిని నింపుకున్న టిప్పర్లు నకరికల్లు తహశీల్దారు కార్యాలయం మీదుగా నరసరావుపేట వెళుతున్నాయి. అయినా రెవెన్యూ యంత్రాంగం మట్టి లారీలను ఆపే ప్రయత్నం చేయడం లేదు. ఇటీవలే కొండ సమీపంలో ఒకరు అనుమ తులు తీసుకుని




తవ్వకాలు చేస్తున్నారు. మరో ఇద్దరు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వి తరలిస్తున్నా చర్యలు తీసుకోవడానికి యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. రాజకీయ నేతల అండదండలు ఉన్నందున అటువైపు వెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోజువారీగా ఎన్ని క్యూబిక్‌మీటర్లకు అనుమతులు తీసుకుంటున్నారు? ఇప్పటివరకు ఎంత పరిమాణానికి అనుమతులు తీసుకున్నారు? తవ్విన ప్రాంతంలో తరలించిన పరిమాణం ఎంత? అన్న లెక్కలు తీస్తే అక్రమాలు బహిర్గత మవుతాయి. త్రిపురాపురం కొండ కింది వైపు నుంచి భారీ యంత్రాలతో మట్టి తవ్వి తరలిస్తున్నారు. ఇవి కొన్నాళ్లు కొనసాగితే కొండ ఆనవాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కొండ పైభాగానికి వెళ్లే కొద్దీ అటవీశాఖకు చెందిన అటవీప్రాంతం ఉంది. కొండకు ఒకవైపు నుంచి తవ్వకాలు చేస్తున్నారు.

ఒక్కొక్క టిప్పరు రూ.6వేల నుంచి అమ్మకాలు చేస్తున్నారు. దూరాన్ని అనుసరించి ధర పెంచుతున్నారు. దీంతో తవ్వకాలు చేస్తున్న నేతలకు రూ.లక్షల్లో సొమ్ము జేబులోకి వెళుతోంది. అనుమతులు లేకపోవడంతో రాయల్టీ రూపంలోనూ ప్రభుత్వానికి ఆదాయం రావడం లేదు. స్థానిక నేతలకు మట్టి తవ్వకాలు కల్పవృక్షంగా మారడంతో ఎంత తవ్వుకుంటే అంత సొమ్ము అన్నట్లు కాసుల పంట పండుతోంది.

# అనుమతులకు సున్నం.. ఆంధ్రాకు ఖనిజం

నల్గొండ: రాష్ట్రంలోనే అత్యధికంగా సున్నపురాయి నిక్షేపాలున్న జిల్లాలు నల్గొండ, సూర్యాపేట. వీటిలోని కృష్ణపట్టి ప్రాంతాలైన దామరచర్ల, పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెంలలో ఈ గనులున్నాయి. రెండు జిల్లాల్లోని తొమ్మిది క్లస్టర్లలో 216.82 చదరపు కిలోమీటర్ల మేర ఉన్న ఈ గనులను ఇటీవలే ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించింది. అయితే వేలం వేసే సమయంలో అధికారుల పర్యవేక్షణ తక్కువకావడంతో ఇదే అదనుగా భావించి ఇక్కడి నుంచి అక్రమంగా నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్లలో సున్నపురాయిని ఎలాంటి అనుమతుల్లేకుండా ఆంధ్రకు కొంత మంది అక్రమార్కులు తరలిస్తున్నారు.

పాలకవీడులో గతంలో రైతుల పేరుతో తీసుకున్న లీజు పేపర్లతో ఆంధ్రలోని దాచేపల్లి ప్రాంతానికి ఇద్దరు గుత్తేదారులు గత కొంత కాలంగా ట్రాక్టర్లలో దాచేపల్లి, పిడుగురాళ్ల ప్రాంతానికి వాడపల్లి చెక్‌పోస్టు ద్వారా అక్రమ రవాణా చేస్తున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అక్కడి పరిశ్రమలకు ఒక్కో టిప్పర్‌ను సగటున రూ.50 వేల వరకు, ట్రాక్టర్‌ను రూ.10 వేల వరకు అమ్మి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఎవరైనా అనుమతులపై ప్రశ్నిస్తే రైతుల పేరుతో ఉన్న పత్రాలు చూపిస్తున్నట్లు సమాచారం.



లోక్‌సభ ఎన్నికలకు ముందు వరకు సాగిన ఈ దందా గత కొంత కాలంగా స్తబ్ధుగా ఉంది. ఎన్నికలు ముగియడం, సున్నపురాయికి డిమాండ్ ఉండటంతో తిరిగి నిర్వహించేందుకు సదరు గుత్తేదారులు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు చింతలపాలెం, మఠంపల్లి మండలాల నుంచి ప్రతి పక్షం రోజులకొకసారి టిప్పర్లలో సున్నపురాయి మట్టపల్లి బ్రిడ్జి ద్వారా ఆంధ్రాకు తరలుతోంది. అనుమతులు లేకుండా.. యథేచ్ఛగా సాగుతున్న ఈ దందాపై సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి

# ఆదాయ పన్నును లెక్కించడం ఎలా

# ఈ టెక్నిక్స్‌తో చాలా ఈజీగా నేర్చుకోవచ్చు..




ఆదాయ పన్నును లెక్కించడం చాలా మందికి పెద్ద సమస్య. అందుకే నిపుణుల సహాయం తీసుకుంటారు. ఆదాయం ఎక్కువగా ఉన్నవారు, వివిధ మార్గాల ద్వారా ఆదాయం ఉన్నవారు సర్టిఫైడ్ నిపుణుల సహకారం తీసుకోవడం మంచిదే. కానీ, వేతన జీవులు, పెద్దగా ఇతర ఆదాయ మార్గాలు లేనివారు సొంతంగానే ఆదాయ పన్నును లెక్కించుకుని, ఐటీఆర్ ను ఫైల్ చేయవచ్చు. ఉద్యోగ, వ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయంపై ఆదాయ పన్నును ప్రభుత్వం విధిస్తుంది. వేతన జీవులకు, వారి సంపాదనపై ఆదాయపు పన్నును ఎలా లెక్కించాలో అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఇందులో పన్ను రేట్లను తెలుసుకోవడమే కాకుండా, మీకు అర్హత ఉన్న వివిధ మినహాయింపుల గురించి కూడా తెలుసుకోవడం మంచిది. ఇన్‌కం టాక్స్ ను లెక్కించడంలో సహాయపడే టూల్స్ ఇంటర్నెట్ లో చాలా ఉన్నాయి. 1. మీ స్థూల ఆదాయాన్ని గుర్తించండి:మినహాయిం పులను పరిగణనలోకి తీసుకోవడానికి ముందు మొత్తం వార్షిక ఆదాయాన్ని గుర్తించాలి. ఉదాహరణకు, మీ జీతం నెలకు రూ. 83,333 అయితే, మీ వార్షిక స్థూల ఆదాయం రూ. 83,333 రూ. 10,00,000 అవుతుంది. 2. మినహాయింపులు, అలవెన్సులు: ఇంటి అద్దె అలవెన్స్ (హెచ్‌ఆర్‌ఏ) వంటి కొన్ని అలవెన్సులను మినహాయించవచ్చు.మీహెచ్‌ఆర్‌ఏ మినహాయింపు ఏడాదికి రూ.1,20,000 అనుకుందాం. అప్పుడు, మీ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ. 10,00,000-రూ. 1,20,000ా రూ. 8,80,000 అవుతుంది. 3. సెక్షన్ 80సీ కింద మినహాయింపులు: మీరు వివిధ సెక్షన్ల కింద మినహాయింపులను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఒకవేళ మీరు పిపిఎఫ్ లో రూ .1,50,000 పెట్టుబడి పెడితే, మీ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ. 8,80,000 - రూ. 1,50,000ా రూ. 7,30,000 లకు తగ్గుతుంది. 4. స్లాబ్ ల వారీగా: పన్ను రేట్లు స్లాబ్ ల వారీగా ఉంటాయి. ఒకవేళ, మీ ఆదాయం 10% పన్ను రేటు పరిధిలోకి వస్తే.. మీరు మీ ఆదాయమైన రూ. 7,30,000 లలో 10 శాతమైన రూ. 73,000 లను పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. 5. సెస్ మరియు సర్‌చార్జ్: వర్తించే వారికి, హెల్త్ సెస్, ఎడ్యుకేషన్ సెస్ సాధారణంగా 4% ఉంటుంది. అంటే, మీరు చెల్లించే పన్నుపై 4% సెస్ మొత్తం కలుస్తుంది. అంటే, మీరు చెల్లించే మొత్తం రూ. 73 వేలు అయితే, దానిపై 4% సెస్ రూ. 2,920 కలిపితే, మొత్తం పన్ను రూ. 75,920 అవుతుంది. 6. టిడిఎస్ (): మీ యజమాని ఇప్పటికే కొంత పన్నును మినహాయించినట్లయితే, ఆ మొత్తాన్ని పన్ను నుంచి తగ్గించవచ్చు. అంటే, ఒకవేళ మీ ఎంప్లాయర్ రూ. 15 వేలు మినహాయిస్తే, మీరు చెల్లించాల్సిన మొత్తం రూ. 75,920 - రూ. 15,000ా రూ. 60,920 లకు చేరుతుంది. 1.తెలివిగా ఇన్వెస్ట్ చేయండి: ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్ లేదా జీవిత బీమా పాలసీల వంటి సెక్షన్ 80సీ పెట్టుబడులను ఉపయోగించండి. ఈ పెట్టుబడులు మీ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయాన్ని తగ్గించడమే కాకుండా భవిష్యత్తు కోసం కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయడంలో సహాయపడతాయి. ఉదాహరణకు, ఈఎల్ఎస్ఎస్ పన్ను ఆదా యొక్క ద్వంద్వ ప్రయోజనాలను అందిస్తుంది. ఈక్విటీ ఎక్స్ పోజర్ కారణంగా అధిక రాబడిని కూడా ఇస్తుంది. అదేవిధంగా, పీపీఎఫ్ గ్యారెంటీ రాబడితో పాటు పన్ను లేని వడ్డీతో సురక్షితమైన పెట్టుబడిగా నిలుస్తుంది.

# ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

నల్గొండ: ప్రజల అవసరాలకు అనుగుణంగానే నగరపాలక సంస్థ అభి వృద్ధి పనులు చేపడుతున్నదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. 13వ డివిజన్‌లో రూ. 13 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ముగియడంతో నగరంలో అభివృద్ధి పనుల్లో వేగం పెరిగిందన్నారు. ఇప్పటికే టెండర్లు పూర్తయిన పనులన్నింటినీ తక్షణమే ప్రారంభించేలా చర్యలు చేపట్టామన్నారు. కొత్త కొత్త కాలనీలు శరవేగంగా పెరుగుతుండగా ఆయా చోట్ల పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసి నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి నగర రూపురేఖలు మార్చామన్నారు. నాలుగేళ్లలో రూ.499 కోట్లతో పనులు చేశామని, వీటిల్లో రూ. 152 కోట్లు సాధారణ నిధులు, రూ.347 కోట్లు సీఎం అస్యూరెన్స్ నిధులని వెల్లడించారు. శివారు ప్రాంతాలు, డివిజన్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రతి రోజూ మంచినీటి సరఫరా అందించాలన్న లక్ష్యంతో రూ. 133 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం తక్కువగా ఉండడంతో రోజు తప్పించి రోజు నీటి సరఫరా చేస్తున్నామని, నీటి మట్టం పెరిగిన వెంటనే తిరిగి ప్రతి రోజూ నీటి సరఫరా చేస్తామని పేర్కొన్నారు. వానకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. వర్షకాలంలో ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు.నాలుగేళ్లలో రూ.499 కోట్లతో పనులు చేశామని, వీటిల్లో రూ. 152 కోట్లు సాధారణ నిధులు, రూ.347 కోట్లు సీఎం అస్యూరెన్స్



నిధులని వెల్లడించారు. శివారు ప్రాంతాలు, డివిజన్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ ప్రతి రోజూ మంచినీటి సరఫరా అందించాలన్న లక్ష్యంతో రూ. 133 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం డ్యాంలో నీటి మట్టం తక్కువగా ఉండడంతో రోజు తప్పించి రోజు నీటి సరఫరా చేస్తున్నామని, వర్షాలతో ఎక్కడైనా వరద నీరు నిలిస్తే వెంటనే తొలగింపునకు చర్యలు చేపడుతామన్నారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్ పరిధిలో 24 గంటల పాటు మంచినీటి సరఫరా చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా సత్వరమే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, డీఈ ఓంప్రకాశ్, డివిజన్ వాసులు పాల్గొన్నారు.

# ఎస్బీఐ ఖాతాదారులకు గుడ్ న్యూస్..!



దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కస్టమర్లకు గుడ్ న్యూస్ అందించింది. ఈ క్రమంలో రూ.2 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై కస్టమర్లకు వడ్డీ రేట్లను ఎస్‌బీఐ పెంచింది. ఈ క్రమంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లపె కొత్త వడ్డీ రేట్లను 0.25 నుంచి 0.75 శాతం వరకు పెంపు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కొత్త ఫిక్స్‌డ్ డిపాజిట్ రేట్లు మే 15, 2024 నుంచి కస్టమర్లకు అమల్లోకి వస్తాయి. దీంతో మీరు5 శాతం వడ్డీని పొందుతున్నట్లయితే, ఇప్పుడు మీరు 5.75 శాతం పొందుతారు. తన కస్టమర్లకు కనీసం 7 రోజులకూడా అందిస్తోంది. ఇది వివిధ పదవీకాలాలకు విభిన్న వడ్డీ రేట్లు ఉంటాయి. సాధారణ వ్యక్తులతో పోలిస్తే సీనియర్ సిటిజన్‌లకు కూడా 0.50 శాతం వరకు అదనపు వడ్డీ లభిస్తుంది.

# గిరిజన పాఠశాలలో కొరవడిన భద్రత



తనకల్లు :మారుమూల పల్లెల్లోని గిరిజన బాలికలు ఆర్థిక సమస్య కారణంగా చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన పాఠశాలలో వసతి కల్పిస్తూ వారి భవిష్యత్తుకు తోడ్పాటునం దిస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన విద్యార్థినుల కోసం తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టు వద్ద గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఐదు నుంచి పదో తరగతి వరకు 400 పైగా విద్యార్థినులు ఇక్కడ చదువుకుంటున్నారు. కాగా.. పాఠశాలలో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలతో విద్యార్థినులకు రక్షణ కరవైందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల కొక్కంటిక్రాస్ నుంచి మహమ్మదా బాద్‌క్రాస్‌కు వెళ్లే రహదారి పక్కనే ఉన్నా.. గ్రామాలు దూరంగా ఉండటంతో రాత్రి సమయంలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ప్రిన్సిపల్ దిద్దుబాటు చర్యలు తీసుకోని కారణంగా అవి పునరావృతం అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. పాఠశాల వెనుకవైపు ఉన్న ప్రహరీ ఎత్తు లేని కారణంగా ఆ వైపు నుంచి దుండగులు పాఠశాలోకి ప్రవేశిస్తున్నారనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. దాదాపు 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి మొత్తం పాఠశాల ముందు వైపు, గదుల్లో ఉండటం, వెనుక భాగాన లేని కారణంగా నిందితుల గుర్తింపునకు ఇబ్బంది కలుగుతోంది. ప్రహరీ ఎత్తు పెంచి ముళ్ల కంచె ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుందని విద్యార్థినుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఫిబ్రవరి 23న అర్ధరాత్రి పాఠశాల మైదానంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి వసతి గది కిటికీని రాయితో పగులకొట్టాడు. చెప్పులు అక్కడే వదిలి ఉండటాన్ని పాఠశాల సిబ్బంది గుర్తించారు. తెల్లవారుజామున ఓ విద్యార్థిని స్నానపు గదిలో ఉండగా ఓ వ్యక్తి చూడటాన్ని గుర్తించిన బాలిక కేకలు వేయడంతో దుండగుడు పరారైనట్లు తెలిసింది. విద్యార్థినులు భయాం దోళన చెందుతున్నారు. పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ జరపగా నిందితుల ఆచూకీ లభ్యం కాలేదు.

# విద్యార్హత లేకున్నా అడ్డగోలు నియామకాలు



జేఎన్‌టీయూ:వైకాపా పాలనలో అడ్డగోలు వ్యవహారాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. తాజాగా జేఎన్‌టీయూ అనుబంధ సంస్థలో ఇద్దరు సహాయాచార్యుల నియామకం విషయంలో అక్రమాలు జరిగినట్లు స.హ. చట్టం ద్వారా తెలిసివచ్చింది. ఈ ఇద్దరి నియామకాలే కాకుండా వర్సిటీ పరిధిలో మరిన్ని అక్రమాలు జరిగినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థలో ఇద్దరు సహాయాచార్యుల నియామకంపై వివాదం నెలకొంది. వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా నియామకాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. విద్యార్హత లేకున్నా నియామకాలు చేపట్టినట్లు తెలుస్తోంది. తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థ (ఓటీపీఆర్ఐ)లో ఫార్మసీ, ఎమ్మెస్సీ ఫుడ్ టెక్నాలజీ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో ఉద్యోగుల కొరత ఉండటంతో గత ప్రభుత్వ హయాంలో నలుగురిని అడ్‌హక్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా నియమించారు. ఆ నలుగురిలో ఇద్దరికి విద్యార్హత లేకపోయినా నియమించినట్లు తెలిసింది. ఓ న్యాయవాది స.హ. చట్టం ద్వారా అడహక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల విద్యార్హతల సమాచారం కోరారు. ఓటీపీఆర్ఐ అధికారులు రాతపూర్వకంగా ఇచ్చిన సమాచారం మేరకు ఇద్దరు సహాయాచార్యులకు విద్యార్హత లేనట్లు గుర్తించారు. యూజీసీ నిబంధనల ప్రకారం ఎమ్మెస్సీ ఫుడ్‌టెక్నాలజీ కోర్సులు బోధించడానికి అదే విభాగంలో ఎమ్మెస్సీతో పాటు పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. కానీ ఇద్దరు సహాయాచార్యులు ఇతర సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ చేశారు. ఆ ఇద్దరిలో ఒకరు మైక్రోబయాలజీలో ఎమ్మెస్సీ, బయో టెక్నాలజీలో పీహెచ్‌డీ చేశారు. మరొకరు ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎమ్మెస్సీ, కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశారు. మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ విద్యార్హత ఉన్నవారు ఫుడ్‌టెక్నాలజీ కోర్సుల బోధనకు అనర్హులని పలువురు జేఎన్‌టీయూ ఆచార్యులు పేర్కొంటున్నారు. వైకాపాకు చెందిన ఓ సలహాదారుడు, అదే పార్టీకి చెందిన మరో ప్రజా ప్రతినిధి సిఫార్సులతో ఈ నియామకాలు జరిగినట్లు చర్చ జరుగుతోంది. మూడు సంవత్సరాల క్రితం ఈ నియామకాలు చేపట్టి ఒక్కొక్కరికి నెలకు రూ.40 వేలు వేతనం చెల్లిస్తున్నారు.

# ఉచిత తర్ఫీదుతో యువతకు భరోసా



కళ్యాణదుర్గం: గత వైకాపా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసింది. ఐదేళ్లలో కనీసం ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా అరకొర పోస్టులతో ప్రకటన విడుదల చేసింది. మెగా డీఎస్సీ అంటూ కేవలం ఆరు వేల పోస్టులతో సరిపెట్టింది. దీంతో నిరుద్యోగుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలో తెదేపా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎట్టకేలకు సీఎం అయ్యాక ఇచ్చిన హామీ మేరకు సదరు ఫైలుపైనే తొలి సంతకం చేశారు. ఈమేరకు 16 వేలకు పైగా పోస్టులతో ప్రకటన విడుదల చేశారు. ఈనేపథ్యంలో నిరుద్యోగులు ఉపాధ్యాయ కొలువు సాధించడంలో నిమగ్నమయ్యారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు ప్రైవేటు సంస్థల్లో శిక్షణ తీసుకుంటున్నారు. పేద, మధ్యతరగతి డీఎస్సీ అభ్యర్థులు సొంతంగానే చదువుకోవాల్సి వస్తోంది. దీన్ని గుర్తించిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఉచితంగా తర్ఫీదు ఇప్పించడానికి నడుం బిగించారు. పరీక్ష జరిగే వరకు కళ్యాణదుర్గంలో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి ఉత్తమ శిక్షకులతో తర్ఫీదు అందించాలని నిర్ణయించారు. ఈమేరకు హైదరాబాద్, అవనిగడ్డ, కర్నూలు తదితర ప్రాంతాల నుంచి 18 మంది శిక్షకులను రప్పించారుఉపాధ్యాయ ఉద్యోగం పొందాలని ఎంతో ఉత్సాహంగా ఉన్నా. 2015లో బీఈడీ పూర్తి చేశా. వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నా. రోజూ ఐదారు గంటలు చదువుతున్నా. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే నిరుద్యోగుల కోసం శిక్షణ ఇప్పించడం అభినందనీయం.

019లో బీఈడీ పూర్తి చేసి సర్వశిక్షా అభియాన్‌లో భాగంగా గ్రామంలోనే చిన్నారులకు బోధన చేస్తున్నా. కుటుంబలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలిగింది. మాలాంటి వారికి ఎంతో ఊరట కలుగుతోంది.

# కుప్పంలో వినతుల వెల్లువ



కుప్పం:స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అన్యూహ్య స్పందన వచ్చింది. వినతులు అందించేందుకు ప్రజలు ఉదయం నుంచే బారులుదీరారు. మొత్తం 600కిపైగా అర్జీలు రాగా.. అందులో 436 రెవెన్యూ సమస్యలపై వచ్చినట్లు అధికారులు తెలిపారు. తమ సమస్యలను ముందుగా నమోదు చేసుకునేందుకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారుల వద్ద గంటల తరబడి నిలబడాల్సివచ్చింది. సమావేశ మందిరంలో కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, జేసీ శ్రీనివాసులు ఇతర జిల్లా అధికారులతో కలిసి వినతులు స్వీకరించారు. వినతులను ఆయా శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకా లను చేరవేయాలని సూచించారు. రెవెన్యూ సంబంధిత ఫిర్యాదులను తహశీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి, పరిష్కరించి పురోగతి తెలియజేయాలన్నారు. మాది శాంతిపురం మండలం గొల్లపల్లె గ్రామం. నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై నడుము, కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నా. రెక్కాడితేనే గానీ డొక్కాడని పరిస్థితి. గత ప్రభుత్వంలో వంద శాతం అంగవైకల్యం ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. దీంతో పింఛన్ మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు. పేద బతుకులు కావడంతో పనికి పోలేక పస్తులుండాల్సి దుస్థితి. పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి. వైకాపా ప్రభుత్వం తెచ్చిన రీ సర్వే చాలా మంది రైతులకు నష్టం చేసింది. నా పేరిట కుప్పం మండలం సజ్జలపల్లె రెవెన్యూ దాఖలాలో సర్వే సంఖ్య 33/1ఎ, 33/5లో 1.84 ఎకరాల భూమి ఉంది. ఇది కొనుగోలు చేసినది. అందుకు సంబంధించిన పాసు పుస్తకం సైతం ఉంది. అయితే గతేడాది చేపట్టిన రీ సర్వే తర్వాత 1.37 ఎకరాలే ఉన్నట్లు రికార్డుల్లో చూపుతోంది. 0.47 సెంట్ల భూమి ఆన్‌లైన్ రికార్డుల్లో మాయమైంది. ఏమైందో ఏమోనని అధికారుల చుట్టూ తిరుగుతున్నా, ప్రయోజనం లేక పోయింది.

# ప్రజలకు రక్షిత నీటిని సరఫరా చేయాలి: సిపిఎం



అనంతపురం కార్పొరేషన్ :అనంతపురం నగరంలోని ప్రజలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని అనంతపురం సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం నగరకమిటీ నాయకులు నగర పాలక సంస్థ మేయర్ వసీంను కలిసి వినతీ పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీటిని శుద్ధి చేయకపోవడంతో ప్రజలు అనేక రోగాల భారీన పడుతున్నారన్నారు. నగరంలో సరఫరా అవుతున్న మంచినీరు పైప్ లైన్ లీకులతో మురుగుకాల్వల్లోని నీరు కలిసి తాగునీరు కలుషితమవుతుందన్నారు. దీనిని అరికట్టడంలో మున్సిపల్ అధికారులు చొరవ చూపడం లేదని విమర్శించారు. కనీసం మున్సిపల్ అధికారులు ప్రజలు డయేరియా నుండి కాపాడుకోవడం కోసం అవగాహన కూడా కల్పించడం లేదని తెలిపారు.ఇప్పటికైనా అధికారులు కలుషిత నీరు తాగడం వల్ల వచ్చే అనారోగ్యాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాని కోరారు..ఈ సందర్భంగా నగర మేయర్ వసీం , డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి స్పందిస్తూ తక్షణమే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తామన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర నాయకులు వెంకటనారాయణ, బాలకృష్ణ, మసూద్, వెంకటేష్ ,నూరుల్లా, ఆటో యూనియన్ శివ ,ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# తితిదే కళాశాలలో ప్రవేశాలకు అష్టకష్టాలు!?



తిరుపతి: తితిదే కళాశాలల్లో ప్రవేశాలు కష్టతరంగా మారాయి. వీటిలో నామమాత్రం రుసుముతో నాణ్యమైన విద్యనందించడంతోపాటు వసతి, భోజనం కల్పిస్తుండటంతో ప్రవేశాలకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. పది పూర్తవగానే అధికశాతం శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలను ఎంచుకుంటున్నారు. పదేళ్లుగా కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థినులతో సమానంగా, వారికంటే ఎక్కువగా మార్కులు సాధిస్తున్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకులు పొందుతున్నారు. కళాశాలలో సీట్ల సంఖ్యను పెంచాలని వైకాపా ప్రభుత్వంలోని తితిదే అధికారులకు కళాశాల అధికారులు, విద్యార్థినుల తల్లిదండ్రులు, పలు విద్యార్థి సంఘాలు విన్నవించినా ఎలాంటి ఫలితం లభించలేదు. నూతన ఈవోగా నియమితులైన శ్యామలరావుకు విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు, పలువురు రాజకీయ నాయకులు ఇదే విషయమై విన్నవించారు. చిత్తూరు, తిరుపతి, రాయలసీమ జిల్లాలతోపాటు ఇతర జిల్లాల విద్యార్థులు ప్రవేశాలపై ఆసక్తి చూపుతున్నారు. మంగళవారంతో స్పాట్ ప్రవేశాలు ముగియగా పరిమిత సీట్లు ఉండటంతో మంచి మార్కులు సాధించినప్పటికీ సీటు లభించక ఎంతోమంది విద్యార్థినులు నిరాశతో వెనుదిరిగారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, సీఈఎల్ కోర్సులను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో రెండు సెక్షన్లుగా నిర్వహిస్తున్నారు. మొత్తం ప్రథమ సంవత్సరంలో 968 సీట్లు ఉండగా ఈ సంఖ్య ఎనిమిదేళ్లుగా పెంచకపోవడంపై ఆవేదన వ్యక్తమవుతోంది.కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో మొత్తం 1936 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తు న్నారు. వీరిలో ప్రథమ సంత్సరం నుంచి 450, ద్వితీయ సంవత్సరం నుంచి 450 మంది విద్యార్థినులు కలిపి మొత్తం 900 మంది విద్యార్థినులకు మాత్రమే వసతి, భోజన సదుపాయం కల్పిస్తున్నారు. మిగిలిన వారు బయట ప్రైవేటు వసతి గృహాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో భద్రత కొరవడి విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీసం రెండువేలమందికి వసతి కల్పిస్తే బాగుంటుందని కోరుతున్నారు. విద్యాకేంద్రంగా భాసిల్లుతున్న తిరుపతిలో తితిదే ఆధ్వర్యంలో నడుస్తున్న జూనియర్ కళాశాలలు తప్పితే ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. ఈ కళాశాలల్లో పరిమిత సీట్లు ఉండటంతో అప్పులు చేసి ప్రైవేటు కళాశాలల్లో చేర్చుతున్నారు. పద్మావతి జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపుకు రూ.4900, ఆర్ట్స్ గ్రూపుకు రూ.3970, హాస్టల్‌కు రూ.3025 చెల్లిస్తే చాలు. ప్రైవేటు కళాశాలల ఫీజులతో పోల్చితే ఈ ఫీజు చాలా తక్కువగా ఉండటంతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తితిదే కళాశాలలో సీటువస్తే బాగుంటుందని ఆశ పడుతున్నారు. ఉన్నతాధికారులు అధికారులు స్పందించి సీట్ల సంఖ్యను పెంచితే బాగుంటుందని కోరుతున్నారు.

## అలిపిరి కాలినడకన

# ఓవర్‌పాస్ నిర్మాణం జరిగేనా?




భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ నిర్మించాలనుకున్న ఓవర్ పాస్(పైవంతెన) నిర్మాణానికి ఏపీలో కొలువుదీరిన ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు. చిరుతపులుల దాడుల్లో చిన్నారి మృత్యువాత పడిన ఘటన గతంలో సంచలనం రేపింది. 2023 జూన్ 22న అలిపిరి కాలినడక దారిలో ఏడో మైలు వద్ద చిరుతపుల్లి కౌశిక్ అనే బాలుడిపై దాడి చేసి గాయపరిచింది. బాలుడు అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన జరిగిన రెండు నెలలకే ఆగస్టు 11వ తేదీన నడిచి వెళుతున్న లక్షిత అనే బాలికపై లక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో చిరుత దాడి చేసి.. సమీప అటవీప్రాంతంలోకి లాక్కెళ్లి చంపేసింది. దాంతో అప్పటి టీటీడీ అధికారులు సాయంత్రం ఐదు గంటల తర్వాత కాలినడక దారిని మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అ?ధికారులు ముందు జాగ్రత్త చర్యగా ఏర్పాటు చేసిన బోన్లలో ఆరు చిరుత పులులు పట్టుబడ్డాయి. అయితే కాలినడక దారిలో భక్తులు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని చెబుతూ మైకులను టీటీడీ ఏర్పాటు చేసింది. అలాగే రక్షణ కోసం భక్తులకు వెదురు కర్రలు కూడా అందజేసింది.ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ఓవర్‌పాస్ (పైవంతెన) ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. చిన్నారులపై చిరుత పులులు దాడి చేసిన సంఘటనా స్థలాన్ని వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా బృందం పరిశీలించింది. ఓవర్‌పాసతోపాటు జంతువులు తిరిగేందుకు వీలుగా అండర్‌పాస్.. అలాగే కాలినడక మార్గానికి రెండువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని నిపుణుల బృందం సూచించింది. దీనికి దాదాపు రూ.50కోట్లు ఖర్చు అవుతుందని అంచనా కూడా వేసింది. ఈ వంతెన వల్ల జంతువుల నుంచి కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని.. అలాగే వన్యప్రాణులకు కూడా భక్తుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంది. దాదాపు ఎనిమిది నెలల క్రితమే ప్రతిపాదనలు టీటీడీకి వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అందజేసింది. కానీ టీటీడీ ఇప్పటి వరకు స్పందించిన దాఖలాలు లేవు. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఇప్పటికైనా ఈ ప్రతిపాదనలపై టీటీడీ తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# టీడీపీ ఖాతాలోకి కార్పొరేషన్




చిత్తూరు:చిత్తూరు నగరపాలక సంస్థ కూటమి ఖాతాలో చేరింది. శుక్రవారం నాటి చేరికలతో కౌన్సిల్‌లో కూటమికి స్పష్టమైన ఆధిక్యత లభించింది. వీరిలో మేయరు అముద, డిప్యూటీ మేయరు రాజేషకుమార్‌రెడ్డి కూడా ఉన్నారు. వైసీపీలో వర్గవిభేదాలు, అసంతృప్తులతో పాటు అధికార పార్టీలో ఉంటే అభివృద్ధి జరుగుతుందన్న భావనతో పలువురు పార్టీ మారారు. నగరంలోని బీవీరెడ్డి కాలనీలోని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాసంలో వీరంతా టీడీపీ కండువా కప్పుకొన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో 50 డివిజన్లు ఉండగా.. అప్పట్లో 37 చోట్ల వైసీపీ దౌర్జన్యంగా ఏకగ్రీవాలు చేసుకుంది. మిగిలిన వాటికి ఎన్నికలు జరగ్గా.. 3 చోట్ల టీడీపీ గెలిచింది. తాజాగా మేయర్, డిప్యూటీ మేయర్ సహా 18 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరడంతో వీరి బలం 21కి పెరిగింది. కొన్నాళ్ల కిందట నలుగురు జనసేనలో చేరారు. దీంతో కౌన్సిల్‌లో కూటమికి 25 మంది సభ్యులయ్యారు. వీరికి తోడు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ ఎక్స్‌అఫిషియో మెంబర్లుగా చేరడంతో ఆ సంఖ్య 27కి చేరింది. ఇంకా కొందరు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కాగా, చేరికల సందర్భంగా ఎమ్మెల్యే గురజాల మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, నగర అభివృద్ధి కోసం మేయరు, డిప్యూటీ మేయరు, కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్పొరేటర్ల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తామన్నారుమాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కటారి హేమలత, నేతలు వసంత్ కుమార్, ఎల్‌బీఐ లోకేష్ రెడ్డి, అశోక్, కంద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అందరి సహకారంతో చిత్తూరును అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని మేయరు అముద తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. వేలూరు, తిరుపతికి దీటుగా చిత్తూరును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని డిప్యూటీ మేయర్ రాజేషకుమార్ రెడ్డి తెలిపారు. దీనికోసం ఎమ్మెల్యే వద్ద మాస్టర్ ప్లాన్ ఉందన్నారు. మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఎన్.రాజేష కుమార్ రెడ్డి, డివిజన్ల వారీగా కార్పొరేటర్లు.. పి.నవీన్ కుమార్ (2వ) బి.అజర్ భాను (6వ), డి.కె.సుమతి (10వ ), ఎం.శాంతి (18వ), పి.గంగ (22వ), ఇ.ఇందు (27వ ), టి.ప్రభావతి (28వ), ఎస్.సుష్మ (30వ), సయ్యద్ సర్దార్ (31వ), ఎస్.ఉన్నికృష్ణ (38వ), పి.గణేష్, (40వ), కుప్పమ్మ (41వ), ఆర్.శశికుమార్ (42వ), పి.వెంకటరమణ (43వ), ఎస్.రెడ్డెప్ప (46వ), ఏజీ సహదేవన్ (50వ డివిజన్).

# టూరిజం హబ్‌గా తిరుపతి

చంద్రగిరి : తిరుపతిని టెంపుల్...ఎకో...హెల్త్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్..రోపవే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు.జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలుతిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన అక్కడే పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేవరాగం పేరిట ఏర్పాటు చేసిన హోటల్‌ను ప్రారంభించారు.అనంతరం తిరుపతి చేరుకుని జూపార్కు సమీపంలో టూరిజం శాఖకు కేటాయించిన 30 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు.ఏపీ టూరిజం కార్యాలయం, భవనాలు, స్థలం, స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలను తనిఖీ చేశారు. పర్యాటకాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో సినీ స్టూడియో నిర్మాణంపై నిర్మాతలతో మాట్లాడతామన్నారు. పర్యాటక అభివృద్ధికి చాలా అవకాశాలున్నా గత ప్రభుత్వం ఒక్క కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకెళ్లడానికి చూస్తామన్నారు. ట్రెక్కింగ్..రోపవే ఏర్పాటుకు అవకాశాలపై అధికారులతో చర్చించామన్నారు.జూపార్క్ దగరున్న 30 ఎకరాల భూమిలో 20 ఎకరాలు ఓబరాయ్ హోటల్‌కు, 10 ఎకరాలు దేవ్‌లోక్ సంస్థకు గతంలో ఇచ్చినా వినియోగించుకోలేదన్నారు. జూలైలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.రుయాస్పత్రి ఎదురుగా అసంపూర్తిగా వున్న టూరిజం బిల్డింగ్‌పై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.చంద్రగిరి కోటలో ఏర్పాటు చేసిన లైట్ అండ్ మ్యూజిక్ షోను త్వరలోనే పునఃప్రారంభిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ,టూరిజం ఎండీ కన్నబాబు,రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్, డీవీఎం గిరిధర్‌రెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, జనసేన నాయకులు హరిప్రసాద్, కిరణ్ రాయల్, రాజా రెడ్డి, సుభాషిణి, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



# తయారీలో సమస్యలు..!

## మందులు రీకాల్ చేసుకుంటున్న ఫార్మా కంపెనీలు

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ ల్యాబోరేటరీస్, సన్ ఫార్మా, అరబిందో ఫార్మా, ఎఫ్‌డీసీ కంపెనీలు అమెరికా నుంచి కొన్ని మందులను రీకాల్ చేసుకుంటున్నాయి. యూఎస్ ఎఫ్‌డీఏ డేటా ప్రకారం, తయారీలో సమస్యలు ఉండడంతో మందుల రీకాల్ చేపడుతున్నాయి. బ్లడ్ ఫెనైలలనైన్ కంట్రోల్ చేయడంలో వాడే జావైగ్టర్ (సాప్రోప్‌టెరిన్ డైహైడ్రోక్లోరైడ్) పౌడర్ (100 ఎంజీ) 20,000 కార్టన్లను డాక్టర్ రెడ్డీస్ రీకాల్ చేసుకుంటోంది. ఈ మెడిసిన్స్ సమర్ధత అనుకున్నదాని కంటే తక్కువగా ఉండడంతోనే రీకాల్ చేపడుతోంది. ఇదే కారణంతో మరికొన్ని లాట్‌ల సాప్రోప్‌టెరిన్ డైహైడ్రోక్లోరైడ్ డ్రగ్‌ను రీకాల్ చేస్తోంది. కిందటి నెల 8 న డాక్టర్ రెడ్డీస్ క్లాస్1 రీకాల్ మొదలుపెట్టిందని యూఎస్ ఎఫ్‌డీఏ ప్రకటించింది. ప్రొడక్ట్‌లు సరిగ్గా లేకపోతే క్లాస్ 1 రీకాల్ చేపడతారు. ఇంజెక్షన్లలో వాడే 11,016 వయల్స్ అంఫోటెరిసిన్ బీ లిపోసమ్ డ్రగ్‌ను యూఎస్ నుంచి సన్ ఫార్మా రీకాల్ చేసుకుంటోంది. ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్‌ను ట్రీట్ చేయడంలో ఈ మందును వాడుతున్నారు. సన్ ఫార్మా యూఎస్ సబ్సిడరీ క్లాస్ 2 రీకాల్‌ను కిందటి నెల 19 న మొదలు పెట్టింది. అదే విధంగా అరబిందో ఫార్మా 13,605 బాటిళ్ల క్లోరజెపటే డైపొటాషియం ట్యాబ్లెట్లు (3.75 ఎంజీ, 7.5 ఎంజీ) రీకాల్ చేస్తోంది. ట్యాబ్లెట్లపై పసుపు మచ్చలు ఉ




ండడంతో ఈ డ్రగ్‌ను కంపెనీ రీకాల్ చేస్తోంది. కిందటి నెల 24 న క్లాస్ 2 రీకాల్‌ను అరబిందో ఫార్మా మొదలు పెట్టింది. మరో ఫార్మా కంపెనీ ఎఫ్‌డీసీ లిమిటెడ్ 3,82,104 యూనిట్ల టిమోలోల్ మలియేట్ ఆఫ్తాల్మిక్ సొల్యూషన్‌ను రీకాల్ చేస్తోంది. ఈ మందును గ్లూకోమా ట్రీట్‌మెంట్‌లో వాడుతున్నారు. కంటైనర్‌లో సమస్యలు ఉండడంతో ఈ కంపెనీ డ్రగ్స్‌ను రీకాల్ చేసుకుంటోంది. కాగా, మందుల ప్యాకింగ్ బాగోలేకపోతే క్లాస్ 2 రీకాల్‌ను చేపడతారు.

# వసతులు సరే.. మరి స్వచ్ఛత..?

రాజపేట:సర్కారు బడుల్లో విద్య బలోపేతానికి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్నందున సకల సదుపాయాలు కల్పించాలని ముందస్తు ప్రణాళికలు రచించి కార్యాచరణ చేపడుతోంది. ప్రతి పంచాయతీకి ఒక బడి ఉండాలనే సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశంతో గతంలో మూతబడిన పాఠశాలలను తిరిగి తెరిపించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలోనే సర్కారు పాఠశాల విద్యార్థులకు తొలిరోజే ఏకరూప దుస్తుల పంపిణీ, పాఠ్యపుస్తకాలు అందజేసే కార్యక్రమానికి పూనుకోవడం విశేషం. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 3,210 పాఠశాలలుండగా అందులో సుమారు 2.11 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఉపపోరు ముగిసిన నేపథ్యంలో బడిబాట కార్యక్రమాలను జిల్లా విద్యాశాఖ షెడ్యూల్ ప్రకారం గత నాలుగు రోజులుగా చురుకుగా కొనసాగిస్తోంది. అంతా బాగానే ఉన్నా పాఠశాలల్లో స్వచ్ఛ కార్మికుల నియామకంపై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టత రాకపోవడం విచారకరం. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తొలిరోజే సర్వాంగ సుందరంగా, సకల సౌకర్యాలతో విద్యార్థులను ఆకర్షించేలా పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారు. సర్కారు బడుల్లో మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పలు వసతులతో పాటు మరమ్మతులు చేపడుతున్నారు. ముఖ్యంగా తాగునీరు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, గదుల్లో ఫ్యాన్లు, బెంచీలు, బోర్డులు, డ్యూయల్ డెస్కులు, డైనింగ్‌హాల్స్ నిర్మాణాలు చురుకుగా సాగుతున్నాయి. మరికొన్ని ఈపాటికే



పూర్తయ్యాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి సదుపాయాలు కల్పించిన బడుల్లో.. స్వచ్ఛత కార్మికుల నియామకం ప్రత్యేకంగా చేపట్టకపోవడంతో పాఠశాలల్లో పారిశుద్ధ్యం ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 2020వ సంవత్సరంలో పాఠశాలల్లో స్వచ్ఛత కార్మికుల వేతనాలను స్థానిక పంచాయతీలే భరించాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈక్రమంలో కొన్ని ప్రాంతాల్లో సకాలంలో పంచాయతీలు స్వచ్ఛత కార్మికులకు వేతనాలు చెల్లించగా.. మరికొన్ని చోట్ల ఆర్థికభారంతో చెల్లించలేక కొన్ని పంచాయతీలు చేతులెత్తేశాయి. స్వచ్ఛ కార్మికులు తమ విధులను చేయకపోవడం, నామమాత్రంగా చేపట్టడం జరుగుతుందనే వాదన వినిపిస్తోంది. ఫలితంగా పాఠశాలల సమయంలో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అధిగమించేందుకు కొన్ని చోట్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులే స్వచ్ఛత పనులు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి.

# రికార్డు స్థాయిలో లాభాలు..
# ఉద్యోగులకు బోనస్‌గా 8 నెలల జీతం




న్యూఢిల్లీ: ఆశించిన దానికంటే అధికంగా లాభాలు రావడంతో ఎనిమిది నెలల జీతానికి సమానమైన మొత్తాన్ని బోనస్‌గా ఇవ్వాలని సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్ణయించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఆ విమానయాన సంస్థ రికార్డు స్థాయిలో 1.98 బిలియన్ డాలర్ల నికర లాభం ఆర్జించింది. దీంతో లాభాల్లో కొంత భాగాన్ని ఉద్యోగులకు బోనస్ రూపంలో చెల్లించనున్నట్లు సంస్థ ప్రకటించింది. కరోనా మహమ్మారి వల్ల మూతపడిన చైనా, హాంకాంగ్, జపాన్, తైవాన్ సరిహద్దులు ఏడాది క్రితం పూర్తిస్థాయిలో తెరచుకోవడంతో ఇది సాధ్యమైందని ఎయిర్‌లైన్ ఆర్థిక నివేదిక వెల్లడించింది. ఏడాది పొడవున విమాన ప్రయాణాలకు డిమాండ్ ఏర్పడిందని పేర్కొంది.

గతేడాది సింగపూర్ ఎయిర్‌వేస్ ప్రపంచంలోనే అత్యుత్తమ విమానయాన సంస్థగా ది స్కైట్రాక్స్ వరల్డ్ ఎయిర్‌లైన్ అవార్డును సొతం చేసుకుంది. దీంతో గత 23 ఏండ్లలో సింగపూర్ ఈ పురస్కారన్ని గెలుచుకోవడం ఇది ఆరోసారి. ఉద్యోగుల అవిశ్రాంత కృషి ఫలితంగానే ఈ అవార్డు దక్కిందని సింగపూర్ ఎయిర్‌లైన్స్ సీఈఓ గో చూన్ ఫాంగ్ అన్నారు. ఎయిర్ ట్రావెల్‌లో మరింత పుంజుకోవడానికి ఇది సహాయపడుతుందని చెప్పారు. కాగా, ఎమిరేట్స్ గ్రూప్ కూడా తమ ఉద్యోగులకు 20 వారాల జీతాన్ని బోనస్‌గా ప్రకటించింది. మే నెల జీతాలతో ఈ మొత్తాన్ని చెల్లించనున్నట్లు వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించినట్లు తెలిపింది.

# విద్యుత్తు నియంత్రికల ధ్వంసం



నల్గొండ :విద్యుత్తు సరఫరాలో కీలకమైన నియంత్రికలను నల్గొండ జిల్లాలో కొన్నాళ్లుగా గుర్తు తెలి యని దుండగులు ధ్వంసం చేస్తున్నారు. రూ.లక్షల విలువైన నియంత్రికలు చెడిపోవడంతో సంస్థపై పెనుభారం పడుతోంది. మరో పక్కరైతులకు, వినియోగదారులకు కరెంటు సరఫరాలో అంతరాయం చోటు చేసుకుంటోంది. ఇలాంటి ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నా విద్యుత్తు యంత్రాంగం చోద్యం చూస్తోంది. దుండగుల ఆగడాలు జిల్లాలో రోజు రోజుకు మితిమీరిపోతున్నాయి. 25 కేవీ విద్యుత్తు నియంత్రిక విలువ సుమారు రూ.1.03 లక్షలు ఉంది. అందులో ఐదు కిలోలకు పైగా రాగి తీగతో పాటు 25 లీటర్లకు పైగా ఆయిల్ నింపి ఉంటుంది. సదరు దొంగలు మాత్రం రాగి తీగ, ఆయిల్‌ను లక్ష్యంగా చేసుకుని ధ్వంసాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో ప్రధానంగా మిర్యాలగూడ డివిజన్ పరిధిలో భారీ స్థాయిలో అపహరణ చోటు చేసుకుంటోంది. దామరచర్ల మండలంలో –27, త్రిపురారం–12, అడవిదేవులపల్లి–3, నిడమనూరు–3, జిల్లా కేంద్రమైన నల్గొండ వల్లభరావు చెరువు సమీపంలో,నకిరేకల్ నియోజకవర్గాల్లో–2 చొప్పున విద్యుత్తు నియంతికలు విధ్వంసానికి గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుందని విద్యుత్తు అధికారులు అంచనా వేశారు. జిల్లాలో ప్రధానంగా జాతీయ, రాష్ట్ర రహదారులు పక్కన ఏర్పాటు చేసిన నియంత్రికలతో పాటు, వ్యవసాయ పొలాల్లో ఉన్న 25 కేవీ సింగిల్ ఫేజ్ నియంత్రికలను లక్ష్యం చేసుకుని ధ్వంసం చేస్తున్నారు. చిల్లర దొంగల పనా... లేక ఇంటి దొంగల హస్తం ఉందా.. అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసి వదిలేస్తున్నారు. కానీ రక్షణ చర్యలు తీసుకోవడంలో మాత్రం విఫలం అవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వీటికి ఎవరు రక్షణగా ఉండాలి.. పోలీసులా... లేక విద్యుత్తు అధికారుల అనే మీమాంస ప్రజల్లో నెలకొంది.

విద్యుత్తు శాఖ అధికారులు మాత్రం నియంత్రికల పరిధిలోని వినియోగదారులు రక్షణ బాధ్యత చూసుకోవాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. విద్యుత్తు నియంత్రికలు ధ్వంసం చేసిన దొంగలను పట్టుకునేలా చర్యలు చేపట్టాం. అయినా కొన్ని ప్రాంతాల్లో దుండగులు వాటి హెడ్జ్ ఫీజులను కర్రలతో కొట్టి విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నారు.

మరో ప్రాంతంలో విద్యుత్తు నియంత్రిక వద్ద ఉన్న ఆన్‌ఆఫ్‌స్విచ్ ఉపయోగించి విద్యుత్తు నిలిపివేసి అందులో ఆయిల్, రాగి తీగలు అపహరిస్తున్నారు. నియంత్రికను ఎందుకు పనికి రాకుండా విధ్వంసం చేస్తున్నారు. ఈ విషయంపై విజిలెన్స్‌కు, పోలీసులకు మా సిబ్బంది ఫిర్యాదులు చేశారు. కేసులు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

# అసంపూర్తి పనులు..
# మౌలిక వసతుల కరవు..?

పెద్దపల్లి :సుల్తానాబాద్ బాలికల ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడి కింద రూ.20 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు నిర్మాణం గోడలకే పరిమితమైంది. పెద్దపల్లి పట్టణం మచిలిఖేడ ప్రాథమిక ఉర్దూ పాఠశాల ముందు మురుగు నీటి దుర్వాసన విద్యార్థులను అనారోగ్యానికి గురి చేస్తోంది. ఇక్కడ 24 మంది విద్యార్థులుండగా అమ్మ ఆదర్శ కమిటీలో వంటశాల, మూత్రశాలల నిర్మాణం గోడలకే పరిమితమైంది. పట్టణంలోని మురుగు నీరు ఈ కాలువ నుంచే ప్రవహిస్తోంది. ఓదెల మండలం హరిపురం ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో పశువులు సంచరిస్తున్నాయి. శ్మశాన వాటిక సమీపంలో బడి ఉండటం శవాలను కాల్చివేసే సమయంలో గదుల్లోకి పొగ వస్తుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. రెండేళ్లుగా 'మన ఊరు–మన బడి' పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పర్యవేక్షణలో పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. జిల్లాలో 539 పాఠశాలల్లో 26,215 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి,ఆట స్థలాలు అందుబాటులో లేవు. బడుల్లో ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు సంచరిస్తున్నాయి. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వేసవి సెలవుల తర్వాత నేడు



పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.

అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం మన ఊరు–మన బడి కింద 191 పాఠశాలల్లో రూ.కోట్ల నిధులతో హడావుడిగా పనులు ప్రారంభించినా పావలావంతు ప్రగతి పూర్తికాలేదు. మండలానికి రెండు ఆదర్శ పాఠశాలల్లో నిర్మాణం తప్పా మిగిలిన చోట్ల ముందడుగు పడలేదు. నిధుల కొరత, ఇతర కారణాలతో ప్రగతి ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల 531 పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో చేస్తున్న ప్రగతిలో అదే నిర్లక్ష్యం కొనసాగుతోంది.

# ఖరీఫ్ సాగుకు ప్రణాళిక

ములుగు: వారం రోజుల్లో రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించనున్న నేపథ్యంలో పంటల సాగుపై కార్యాచరణకు జిల్లా వ్యవసాయశాఖ సిద్ధమవుతోంది. వ్యవసాయానికి ములుగు జిల్లా పెట్టింది పేరు. ఈ జిల్లాలో పరిశ్రమలు, ఇతర వాణిజ్య వ్యాపారాలు తక్కువగా ఉండటంతో.. ఇక్కడి ప్రజలు ఎక్కువ శాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ప్రధానంగా వరి, పత్తి, మిర్చి మొక్కజొన్న పంటలు పండిస్తుంటారు. త్వరలో ఖరీఫ్ ఆరంభం కానుండగా రైతులకు సేద్యంపై దిశా నిర్దేశం చేసేందుకు వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సాగు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఎంత మోతాదులో ఎరువులు, విత్తనాలు అవసరమవుతాయనేది కూడా అంచనా వేశారు. జిల్లా పరిధిలోని మొత్తం 1,77,670 ఎకరాల్లో సేద్యం జరుగుతుందనేది అధికారుల అంచనా. ఈ భూముల్లో సుమారు 85,990 మంది రైతులు వివిధరకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి, పత్తి, మిర్చి, జొన్నలు, మొక్కజొన్న, వేరు శనగ, మినుములు, పెసలు, కందులు, తదితర మొదలగు పంటలు పండిస్తున్నారు.

అత్యధికంగా చెరువులు, కుంటల ఆధారంగానే జిల్లాలో సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 1,42,116 ఎకరాల్లో సాగు చేస్తారనేది అంచనా. ఇందులో 1,12,180 ఎకరాల్లో వరి సేద్యం జరుగుతుందని వ్యవసాయాధికారుల అంచనా.మిగతా భూమిలో పత్తి,



మిరప, మొక్కజొన్న, తదితర పంటలు వేసే అవకాశాలున్నాయి. పంటల సాగుకు ఎరువులు అవసరం ఉంటాయనే దానిపై ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వానాకాలం పంటల సాగు విసీర్ణం అంచనాలు సిద్ధం చేసాం. పంటల సాగుపై పురుగు మందులు వాడ కుండా జిల్లా పరిధిలోని రైతులకు అవగాహన కల్పిస్తాం. ఈ సేద్యంపై కర్ష కులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, పురు గు మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

# దక్షిణాదిల్లో వన్యప్రాణుల గణన




తిరువనంతపురం: దక్షిణ భారతదేశం అంతటా (కర్ణాటక, తమిళనాడు,కేరళ,తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో) మే 23 నుంచి 25వరకు ఏనుగుల గణన జరగనుంది. కేరళ, తమిళనాడు మరియు కర్ణాటకలతో కూడిన అంతర్–రాష్ట్ర సమన్వయ కమిటీ తీర్మానాలను రూపొందించింది. దానిలో ఉమ్మడి భాగస్వామ్యం ద్వారా మానవ–వన్యప్రాణుల విభేదాలను పరిష్కరించడం కీలకలక్ష్యంగా పెట్టుకుంది. సహకార కసరత్తులో ఆంధ్రప్రదేశ్ కూడా చేరనుంది. నాలుగు రాష్ట్రాల అటవీ శాఖల అధిపతులు ఇటీవల ఆన్‌లైన్‌లో సమావేశమై జనాభా గణన ప్రక్రియపై చర్చించారు. గణన మొదటి రోజు బ్లాక్ కౌంట్ శాంప్లింగ్ (లేదా డైరెక్ట్ కౌంట్)పద్ధతితో ప్రారంభమవుతుంది, ఇక్కడ అటవీ డివిజన్‌లను 4 నుండి 6 చదరపు కిలోమీటర్ల వరకు నమూనా బ్లాక్‌లుగావిభజించారు. రెండవ రోజు, పరోక్ష 'పేడ గణన' (లేదా లైన్ ట్రాన్సెక్ట్) పద్ధతిని అమలు చేస్తారు. ఏనుగు పేడ సాంద్రత మరియు ఏనుగుల నుండి దాని దూరాన్ని (లేదా డేటా సేకరణ కోసం కాలినడకన 2 కి.మీ వరకు ఉన్న సరళ రేఖలు) ఆధారంగా ఏనుగు సంఖ్యలను అంచనా వేస్తారు. మూడవ రోజు వాటర్‌హోల్ కౌంట్ పద్ధతిపై దృష్టిసారిస్తారు. ఏనుగులు తరచుగావచ్చే నీటి వనరులను గుర్తిస్తారు. కేరళలో, తమిళనాడు మరియు కర్ణాటక సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేకశ్రద్ధతో అనముడి,నిలంబూర్,పెరియార్ మరియు వాయనాడ్‌ఏనుగులరిజర్వ్‌ల మీదుగా దాదాపు 610శాంపిల్‌బ్లాక్‌లను ఏనుగుల గణనఅంచనా వేయనున్నట్లు చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ డి.జయ ప్రసాద్‌తెలిపారు. వివిధ ప్రాంతాలలో నీటి గుంటల వైపు ఏనుగుల కదలికను కూడా అంచనా వేస్తుంది. జూన్ 23లోగా ప్రాథమిక నివేదికను రూపొందించి,జూలై 9లోగా తుది నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నారు. గత సంవత్సరం అంచనా బ్లాక్ కౌంట్ మరియు పేడ గణన పద్ధతులు వరుసగా 1,920 మరియు 2,386 ఏనుగులను నమోదు చేశాయి, 2017లో (వరుసగా 3,322 మరియు 5,706) గణనల కంటే చాలా తక్కువ.

# రియల్ ఎస్టేట్
# రంగంపై పెను ప్రభావం

అమెరికాలో రియల్ ఎస్టేట్ రంగం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకొన్న ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, భారీ భవంతులు, ఆఫీసు స్థలాలు విక్రయాలు లేక ఘోస్ట్ హౌస్‌లుగా మారుతున్నాయి. అమ్మకాలు భారీగా పతనమవ్వడంతో రియల్టర్లు డిస్కౌంట్ల బాట పడుతున్నారు. 50 శాతం మేర రాయితీ ప్రకటిస్తున్నారు. వాణిజ్య కార్యకలాపాలే కాదు రియల్ ఎస్టేట్ లావాదేవీలు కూడా గణనీయంగా పడిపోయాయి. అయితే, సంక్షోభం ముగిసిన తర్వాత విక్రయాలు ఊపందుకొంటాయనుకొన్న రియల్టర్ల అంచనాలు తారు మారయ్యాయి. ఆర్థిక సంక్షోభ భయాలు, కరోనా నేర్పించిన ఆరోగ్య సంరక్షణ పాఠాలతో వైద్య ఖర్చులకు బడ్జెట్‌ను పెద్దమొత్తంలో కుటుంబాలు కేటాయించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ పెరగడంతో ఆఫీసు స్పేస్‌లకు గిరాకీ తగ్గడం వెరసి రియల్ ఎస్టేట్ రంగంపై పెను ప్రభావం పడింది. కరోనాకు ముందు బ్యాంకుల నుంచి వడ్డీకి పెద్ద మొత్తంలో రుణాలను తీసుకొచ్చిన రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ భవనాలను నిర్మించాయి.

విక్రయాల ద్వారా వచ్చిన మొత్తంతో బ్యాంకు బకాయిలను చెల్లించాలనుకొన్నాయి. కానీ, కరోనా తర్వాత కొనుగోలుదారుల నుంచి ఆశించిన మేర స్పందన రావట్లేదు. మరోవైపు బ్యాం కుల నుంచి ఒత్తిడి పెరగ




సాగింది. దీంతో చేసేదేమీ లేక నిర్మాణం ఖర్చుల కంటే తక్కువ మొత్తాలకే విక్రయాలు జరుగుతున్నాయి. మన్‌హట్టన్‌లో ఓ బ్రోకర్ ఓ భారీ భవంతిని 50 శాతం డిస్కౌంట్‌తో ఇటీవల కొనుగోలు చేశాడు. లాస్‌ఏంజెల్స్‌లో ఓ బహుళ అంతస్తుల భవనాన్ని ఓ వ్యక్తి పదేండ్ల కిందట కొనుగోలు చేశాడు. గత డిసెంబర్‌లో దాన్ని కొన్న ధర కంటే 45 శాతం తక్కువకు విక్రయించాడు. ఇలా చెప్పుకొంటూ పోతే ఈ జాబితా పెద్దదే. అమెరికాలోనే కాకుండా జర్మనీ వంటి ఐరోపా దేశాలతో పాటు భారత్‌లోనూ రియల్ ఎస్టేట్ కుదేలవుతున్న సంకేతాలు కనిపిస్తున్నట్టు నిర్మాణరంగ నిపుణులు చెబుతున్నారు.

# 42 ఏళ్ల అమ్మాయితో అభిషేక్ బచ్చన్ ప్రేమకలాపం..!





బాలీవుడ్ స్టార్ కపుల్ అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ పర్సనల్ లైఫ్ గురించి సోషల్ మీడియాలో అనేక వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ఎక్కువగా వీరిద్దరి విడాకుల గురించే చర్చ నడుస్తుంది. మరోవైపు నటి నిమ్రత్ కౌర్ తో అభిషేక్ డేటింగ్ అంటూ మరో చర్చ తెరపైకి వచ్చింది. అయితే ఇది కేవలం రూమర్స్ మాత్రమే. ఇప్పటివరకు దీనిపై అభిషేక్, ఐశ్వర్య స్పందించలేదు. నిమ్రత్ పేరు అభిషేక్‌తో కలిపి చర్చనీయాంశం కావడంతో ఆమె గురించి చాలా విషయాలు తెలుసుకోవాలని అభిమానులు గూగుల్లో తెగ సెర్చ్ చేస్తున్నారు. ఇంతకీ ఆమె ఎవరు.. ? బ్యాక్ గ్రౌండ్ ఏంటీ అనే విషయాలపై చర్చ నడుస్తోంది. ఇక నిమ్రత్ కూడా 42 ఏళ్ల వయసులో కూడా ఒంటరిగానే ఉంది. నిమ్రత్ కౌర్ తండ్రిని కశ్మీర్‌లో తిరుగుబాటుదారులు హతమార్చారు. ఈ సంఘటన తర్వాతనిమ్రత్ కుటుంబజీవితంపూర్తిగా మారిపో యింది. ఘటన అనంతరం నటి కుటుంబంతో సహా ఢిల్లీకి వచ్చింది. ఢిల్లీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన నిమ్రత్ మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. మోడలింగ్ ప్రారంభించిన తర్వాత, నిమ్రత్‌కు చాలా ప్రకటనలలో నటించే అవకాశం వచ్చింది. నిమ్రత్ 2006లో విడుదలైన వన్ నైట్ విత్ దికింగ్ చిత్రంలో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. కానీ 2012లో విడుదలైన 'పెడ్లర్స్' సినిమా ఈ నటికి పాపులారిటీని తెచ్చిపెట్టింది. ఎన్నో సినిమాల్లో నటించిన ఈ భామకు 'లంచ్‌బాక్స్' సినిమాతో మరింత గుర్తింపువచ్చింది. ఆతర్వాత అభిషేక్ బచ్చన్‌తో కలిసి 'దసవి' సినిమాలో ముఖ్య పాత్ర పోషించింది. సినిమాలో అభిషేక్ భార్య పాత్రలో నిమ్రత్ నటించింది. అప్పటి నుంచే వీరిద్దరీ మధ్య రిలేషన్ మొదలైనట్టు టాక్.

# ప్రశాంత్ నీల్ లైనప్.. డౌట్స్ అక్కర్లే!

ఇండియా వ్యాప్తంగా ఎన్నో భాషలు ఉన్నా.. అందులో కొన్ని ఇండస్ట్రీల్లో మాత్రమే పాన్ ఇండియా రేంజ్‌లో పేరున్న దర్శకులు ఉన్నారు. మరీ ముఖ్యంగా సౌత్ ఇండియాలో ఇప్పటికే కొందరు డైరెక్టర్లు తమదైన మార్కును చూపించారు. అలాంటి వారిలో కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రశాంత్ నీల్ ఒకడు. 'కేజీఎఫ్' ఫ్రాంచైజీతో దేశ వ్యాప్తంగా ప్రభావాన్ని చూపించిన అతడు.. వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్నాడు. 'కేజీఎఫ్'తో వరల్డ్ ఫేమస్ అయిన ప్రశాంత్ నీల్.. ఆ తర్వాత పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో 'సలార్: సీజ్‌ఫైర్' సినిమాను చేశాడు. ఇది మంచి రెస్పాన్స్‌ను అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ మీద భారీ ప్రభావాన్నే చూపించింది. దీని తర్వాత అతడు ఈ చిత్రం సీక్వెల్‌ను చేస్తున్నట్లు ప్రకటించాడు. అలాగే, జూనియర్ ఎన్టీఆర్‌తోనూ ఓ భారీ ప్రాజెక్టును అనౌన్స్ చేసేశాడు. ప్రశాంత్ నీల్ తన తదుపరి ప్రాజెక్టును జూనియర్ ఎన్టీఆర్‌తోనే చేస్తాడని, ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన వర్క్‌నే చేస్తున్నాడని జోరుగా వార్తలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభాస్ పుట్టినరోజును పురస్కరించుకుని హొంబళే ఫిల్మ్స్ సంస్థ 'సలార్ 2' సినిమా షూటింగ్ ప్రారంభం అయిందని అధికారికంగా ప్రకటించింది. దీంతో ప్రశాంత్ లైనప్‌పై అనుమానాలు పెరిగిపోయాయి. వాస్తవానికి ప్రశాంత్ నీల్ ముందుగా జూనియర్ ఎన్టీఆర్ సినిమానే చేయాలని అనుకున్నా.. హొంబళే సంస్థ 'సలార్ 2'నే కంప్లీట్ చేయాలని పట్టుబట్టినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, ప్రభాస్ ఇప్పుడు వరుసగా 'ది రాజా సాబ్'తో పాటు 'ఫౌజీ' మూవీలను చేసేందుకు ప్లాన్ చేసుకున్నాడు. కాబట్టి 'సలార్ 2' మూవీకి ఇప్పట్లో డేట్లు కేటాయించలేడు. కాబట్టి ఈ విషయంలో ప్రశాంత్ నీల్ సేఫ్ అయిపోయాడని అనుకోవచ్చు. జూనియర్ ఎన్టీఆర్ కూడా ఇప్పుడు 'వార్ 2' సినిమా షూటింగ్‌లోనే పాల్గొంటున్నాడు. వచ్చే జనవరి లేదా ఫిబ్రవరి వరకూ అతడు కూడా ఖాళీగా ఉండడు. కాబట్టి అప్పటి వరకూ ప్రశాంత్ తన పనులతో తాను బిజీగా ఉండొచ్చు. ఆ తర్వాత ఎన్టీఆర్ సినిమాను పట్టాలెక్కించే అవకాశం ఉంది. అంటే ప్రస్తుతానికి ప్రశాంత్ నీల్ ఓటు తారక్‌కు మాత్రమే వేయాలని చూస్తున్నట్లు చెప్పుకోవచ్చు.

# ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుట్టగొడుగులు..

కాశ్మీర్‌లో పెరుగుతున్న గుచ్చి మష్రూమ్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుట్టగొడుగులలో ఒకటి. ఇది చాంటెరెల్స్, యూరోపియన్ వైట్ ట్రఫుల్ లేదా యార్సా గున్‌బు ..వీటికంటే ఈ పుట్టగొడుగుల ధర వేలల్లో ఉంటుంది. అయితే ప్రపంచంలోని ఐదు అత్యంత ఖరీదైన పుట్టగొడుగులలో ఒకటైన గుచ్చి భారతదేశంలోని దక్షిణ, ఉత్తర కాశ్మీర్‌లో మాత్రమే లభిస్తుంది. వీటి ప్రత్యేకత ఏంటంటే..వీటిని మానవులు ఫామ్ చేయలేరు. ఎందుకంటే అవి వాటికంతట అవే సహజసిద్ధంగా పెరుగుతుంటాయి. ఇంగ్లీషులో మోరెల్స్ అని, ఉర్దూలో గుచ్చి అని అంటారు. కొండలపై నివసించే వారు వీటిని కష్టపడి సేకరించి డబ్బు సంపాదించుకుంటున్నారు. దీన్ని ప్రకృతి యొక్క అమూల్యమైన నిధిగా అంటుంటారు. వీటిని సేకరించాలంటే ఎత్తైన కొండలు, పర్వతాలను ఎక్కాల్సి ఉంటుంది. కాగా గుచ్చి పుట్టగొడుగులు మార్చి,ఏప్రిల్ నెలల్లో ఎక్కువగా లభిస్తాయి. ఈ సమయంలో ఉరుములతో కూడిన వర్షం కురుస్తుంది. కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఉన్న చాలా అందమైన గ్రామం అరిపాల్‌లో గుచ్చి ఎక్కువగా లభిస్తుంది. ఇక్కడ వీటిని ఎండబెట్టి మార్కెట్లోకి విక్రయిస్తుంటారు. నాణ్యమైన గుచ్చి కిలో రూ.40 వేల వరకు విక్రయిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యపోతారు.చైనీస్,అరబిక్, ఇటాలియన్ వంటి అనేక రకాల వంటకాల్లో వీటిని ఉపయోగిస్తున్నప్పటికీ, కాశ్మీరీ ఆహారంలో వీటిని ఎక్కువగా ఇష్టపడతారు. వాటిని పులావ్, కోర్మా లేదా స్టఫింగ్‌లో తయారుచేసే రుచి మరే ఇతర వంటకాల్లో చూడలేము. గుచ్చి కాశ్మీర్‌లోని ఇతర



అద్భుతమైన రుచులతో కలిపితే, పులావ్ మరింత రుచికరంగా మారుతుంది. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇష్టమైన కూరగాయలలో ఒకటిగా చేర్చారు. ఒక ఇంటర్వ్యూలో, ప్రధాని మోదీ దాని రుచి గురించి కూడా చెప్పారు. ఇవి ప్రత్యేక సందర్భాలలో ప్రత్యేక అతిథుల కోసం మాత్రమే తయారు చేస్తారు. భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాలలో కూడా గుచ్చి మష్రూమ్ బాగా డిమాండ్ ఉంది. కాశ్మీర్‌లో లభించే ఈ పుట్టగొడుగు నేడు ప్రపంచంలోని అనేక పెద్ద రెస్టారెంట్‌ల మెనూలో చేర్చడానికి కారణం ఇదే.

# కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయాన్నే ఇవి తినాలి



మన శరీరంలోని అతి ముఖ్యమైన అవయవాలలో కిడ్నీలు ఒకటి. మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. రక్తం నుండి టాక్సిన్స్, అదనపు ద్రవాలను ఫిల్టర్ చేయడంలో మూత్రపిండాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఈ రోజుల్లో, చెడు ఆహారం, జీవనశైలి కారణంగా కిడ్నీ వ్యాధుల కేసులు పెరుగుతున్నాయి. చాలా మంది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, కిడ్నీ ఇన్ఫెక్షన్ లేదా కిడ్నీ ఫెయిల్యూర్ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే ఉదయాన్నే ఎలాంటి ఆహారం తీసుకోవాలో చూద్దాం. మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, సరైన జీవనశైలిని అనుసరించడం చాలా ముఖ్యం. దీనితో పాటు, ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ ఉదయం ఈ ఆహారాలను తీసుకోవడం చాలా ముఖ్యం.వీటిలో కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడే విటమిన్లు, మినరల్స్,యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. రోజూ ఉదయం పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిది. వీటిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. యాపిల్స్, బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీస్ వంటి పండ్లను తీసుకోవడం వల్ల కిడ్నీలకు మేలు జరుగుతుంది. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి మూత్రపిండాలు దెబ్బతినకుండా కాపాడతాయి. కిడ్నీ ఆరోగ్యానికి ప్రతి రోజూ ఉదయాన్నే కూరగాయల జ్యూస్ తాగడం మంచిది. మీరు ప్రతిరోజూ ఉదయం దోసకాయ, పొట్లకాయ లేదా పాలకూర జ్యూస్ త్రాగవచ్చు. వీటిలో అధిక మొత్తంలో నీరు ఉంటుంది. ఇది మూత్రపిండాలను నిర్విషీకరణ చేయడానికి సహాయపడుతుంది. కూరగాయల రసాలలో విటమిన్లు ఖనిజాలు కూడా ఉన్నాయి. ఇవి మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఫోలిక్ యాసిడ్, యాంటీఆక్సిడెంట్లు,విటమిన్ సి వంటి పోషకాలు ఆకు కూరలలో లభిస్తాయి. మీరు మీ ఆహారంలో పాలకూర, కాలే వంటి ఆకు కూరలను చేర్చుకోవాలి. మీరు ప్రతిరోజూ ఆకు కూరలు తింటే, కిడ్నీలు పాడవకుండా కాపాడుతుంది. ఆకు కూరలు తీసుకోవడం వల్ల కిడ్నీలు డిటాక్సిఫై అవుతాయి.

# రెడ్ బికినీలో తేజస్వి..



టాలీవుడ్‌లో తనదైన స్టైల్‌తో ఓ ప్రత్యేకమైన క్రేజ్‌ను సంపాదించుకున్న తేజస్వి మదివాడ.. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతూనే ఉంది. ఇన్ స్టాల్ గ్రామ్ లో ఆమె సొగసులు.. ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్ ఫ్యాన్స్‌ను మరింత దగ్గర చేసాయి. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫోటోలు నెట్టింట సెన్సేషన్ అవుతున్నాయి. తాజాగా తేజస్వి రెడ్ కలర్ బికినీలో దిగిన ఫోటోలను షేర్ చేసింది. అంటూ క్యాప్షన్ పెట్టిన ఆ ఫోటోలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. ఆ డీప్ రెడ్ టోన్ లుక్‌తో తేజస్వి స్టన్నింగ్‌గా కనిపిస్తోంది. కూల్ సన్‌గ్లాసెస్, క్లీన్ అండ్ క్లాసీ లుక్‌తో స్మార్ట్‌గా పోజులిస్తూ అందరినీ అట్రాక్ట్ చేసింది. ఈ ఫోటోల్లోని గ్లామర్ దెబ్బకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. ప్రైవేట్ పూల్ సైడ్‌లో ఈ ఫోటో షూట్ చేసినట్టుగా కనిపిస్తోంది. అంతకు ముందు కూడా తన ఫిట్‌నెస్, స్టైలిష్ డ్రెస్సింగ్ సెన్స్‌తో తేజస్వి తరచూ సోషల్ మీడియా ఫాలోవర్లను అలరిస్తుంది. గ్లామర్ ఫోటో షూట్స్ తో తన అందాన్ని హైలైట్ చేస్తూ ఉండటం ఆమెకి కొత్తేమి కాదు. ఈసారి తేజస్వి చేసిన ఫోటో షూట్ గతంలో ఎన్నడూ లేనంత హాట్ టాపిక్ అయింది. ఫ్యాన్స్ కామెంట్స్ కూడా అదే రేంజ్ లో వచ్చాయి. కెరీర్‌లో సక్సెస్ కోసం ఎదురుచూస్తున్న తేజస్వి.. ఇదే విధంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదిస్తోంది. ప్రస్తుతం తేజస్వి కొన్ని చిన్న సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఆమె లుక్స్ మాత్రం పెద్ద హీరోయిన్స్‌కు ఏ మాత్రం తీసిపోవడం లేదు. ఇక అమ్మడు త్వరలోనే మంచి బ్రేక్ అందుకుంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ ఫోటోలు చూస్తుంటే, ఆమె గ్లామర్ రేంజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పక్కర్లేదు. మరి ఈ గ్లామర్ లుక్స్ ద్వారా అమ్మడికి ఇంకా ఏమైనా అవకాశాలు పెరుగుతాయా లేదో చూడాలి.

# నా విలువను పెంచదు..



ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న భామల్లో ఒకరు సాయి పల్లవి. ఈ బ్యూటీ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి అమరన్. శివకార్తికేయన్ నటిస్తోన్న ఈ చిత్రం అక్టోబర్ 31న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది. సాధారణంగా బాలీవుడ్ సెలబ్రిటీలు తమ స్టార్‌డమ్, మార్కెట్‌ను పెంచుకునేందుకు పీఆర్ ఏజెన్సీలను పెట్టుకుంటారని తెలిసిందే. అమరన్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న సాయిపల్లవి బీటౌన్‌లో పీఆర్ మాఫియా గురించి చెప్పుకొచ్చింది. తన ఇమేజ్‌ను పెంచుకోవడానికి పీఆర్ ఏజెన్సీ ఆఫర్‌ను తిరస్కరించిందట సాయిపల్లవి. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. బాలీవుడ్‌కి చెందిన ఓ వ్యక్తి ప్రొఫెషనల్‌గా నా ఇమేజ్‌ను మరింత పెంచుకునేందుకు ఏజెన్సీ అవసరమా..? అని అడిగాడు. అలా చేస్తే నేను లైమ్‌లైట్‌లో ఉంటా. అందరూ నా గురించి మాట్లాడతారని అతడు చెప్పాడు. నేను మాత్రం వద్దని చెప్పాను. ఎందుకంటే పీఆర్ ఏమీ ఇవ్వదు. అంతేకాదు పీఆర్ నా విలువను పెంచదు. నా గురించి తరచూ మాట్లాడితే జనాలకు విసుగు వస్తుంది. నేను ఖాళీ పబ్లిసిటీ కంటే నిజమైన అనుబంధానికి ఎక్కువ విలువ ఇస్తానని చెప్పుకొచ్చింది సాయిపల్లవి. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సాయిపల్లవి మరోవైపు నాగచైతన్య హీరోగా నటిస్తోన్న తండేల్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇందులో శ్రీకాకుళం అమ్మాయి సత్యగా కనిపించనుంది. హిందీలో రామాయణతోపాటు టైటిల్ ఫిక్స్ కాని మరో సినిమా కూడా చేస్తోంది.

# రోగ నిరోధక శక్తిని పెంచే ఫుడ్స్..

రోగ నిరోధక శక్తి గురించి ఇప్పుడిప్పుడే అవగాహన పెరుగుతుంది. ఇమ్యూనిటీ ఉన్నప్పుడే జలుబు, దగ్గు, ఫీవర్ తోపాటు అనేక రోగాలను శరీరం ఎదుర్కొంటుంది. లేదంటే మనిషి వ్యాధితో మంచానికే పరిమితం కావాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అందుకే ఇమ్యూనిటీ ఇంపార్టెంట్ అని చెప్తారు నిపుణులు. రోగ నిరోధక శక్తి పెంచుకునేందుకు తీసుకోవాల్సి ఆహారం గురించి వివరిస్తున్నారు. విటమిన్ ఎ, సి, ఇలతో కూడిన పాలకూర.. రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఫ్రీరాడికల్స్ తో పోరాడే యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంది. ఐరన్, మెగ్నీషియం మూలంగా ఉన్న ఈ ఆకు కూర.. సంపూర్ణ ఆరోగ్యానికి మద్దతిస్తుంది. బాదం విటమిన్ ఇ గొప్ప మూలం. కాగా ఆరోగ్యకరమైన ఫ్యాట్స్, ఫైబర్, ప్రోటీన్స్ కలిగి ఉంటుంది. శక్తి స్థాయిలను పెంచి ఆరోగ్య నిర్వహణకు హెల్ప్ అవుతుంది. పసుపులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ పదార్థం కర్కుమిన్ ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కలిగిన పసుపు.. ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హాని నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. అల్లం యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమెటరీ లక్షణాలు కలిగి ఉంటుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. వికారం తగ్గిస్తుంది. హానికారకమైన వ్యాధికారక క్రిములతో పోరాడటం, వాపును తగ్గించడం ద్వారా రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వెల్లుల్లిలోని అల్లిసిన్ ఇమ్యునిటీ పవర్ పెంచేందుకు



ప్రసిద్ధి చెందింది. ఇది రోగ నిరోధక ప్రతిస్పందనను పెంచుతుంది. రక్తపోటు తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. పేగు ఆరోగ్యానికితోడ్పడుతుంది. ప్రోటీన్, కాల్షియం,విటమిన్ డి మూలంగా ఉన్న ఇది పూర్తి ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. విటమిన్లు ఏ, సి, ఈ.. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్ల పవర్ హౌజ్ బ్రోకలీ. రోగ నిరోధక పనితీరును మెరుగుపరుస్తుంది. డిటాక్సిఫికేషన్ కు మద్దతు ఇస్తుంది. పోషకాలు అధికంగా కలిగి పూర్తి ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

# షుగర్ కంట్రోల్ చేస్తున్న దాల్చిన చెక్క



యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీబయాటిక్ లక్షణాలు కలిగిన దాల్చిన చెక్క బరువు తగ్గించేందుకు ఉబకాయ చికిత్సలో ఉపయోగపడింది. అయితే తాజా అధ్యయనాలు షుగర్ కంట్రోల్ చేయడంలోకూడా కీలక పాత్ర పోషిస్తుందని తేల్చాయి. ఇంతకీ ఎలా వినియోగించబడుతుంది? ఎన్ని విధాలుగా సహాయపడుతుంది? తెలుసుకుందాం. మధుమేహం కోసం దాల్చినచెక్కను ఉపయోగించడం వల్ల కలిగే అతిపెద్దప్రయోజనాల్లో ఒకటి ఇన్సులిన్ సెన్సిటివిటీ స్థాయిలను పెంచుతుంది. ఇది మీ శరీరంలోని ఇన్సులిన్ మెరుగ్గా పనిచేసేలా కణాలకు చక్కెరను పొందడంలో మరింత సమర్థవంతంగా చేస్తుంది. మెటబాలిక్ సింర్రోమ్, ఇన్సులిన్ నిరోధకతకు దారితీసే పరిస్థితిని మేనేజ్ చేస్తుంది. మరణాలను తగ్గించడంలో సహాయప దుతుంది. ఫైటోథెరపీ రీసెర్చ్‌లో ప్రచురించబడిన అధ్యయనం రోగులపై దాల్చిన చెక్క ప్రభావాన్ని అంచనా వేసింది. 1.5గ్రా దాల్చినచెక్క రోజుకు రెండుసార్లు మూడు నెలల పాటు తీసుకుంటే..ఇన్సులిన్ స్థాయిలను తగ్గిస్తుందని, ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుం దని తేల్చింది. భోజనం చేశాక రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దాల్చిన చెక్క దీనిని అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. తినే ఆహారం జీర్ణమయ్యే వేగాన్ని తగ్గిస్తుంది. ది అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురించబడిన మరో అధ్యయనం ప్రకారం., కేవలం పాయసం తినడంతో పోలిస్తే బియ్యంతో చేసిన పరమాన్నంలో ఆరు గ్రాముల దాల్చినచెక్కను చేర్చడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. మధుమేహం కారణంగా గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదం ఉండొచ్చు. జర్నల్ ఆఫ్ క్లినికల్ లిపిడాలజీలో ప్రచురించబడిన అధ్యయనం.. దాల్చిన చెక్క కొలెస్ట్రాల్ నిర్వహణలో సహాయపడుతుందని తెలిపింది. ఇది గుండె జబ్బులకు దారితీసే రక్తంలో ఉండే ట్రైగ్లిజరైడ్స్, మొత్తం కొలెస్ట్రాల్ సాంద్రతలను తగ్గిస్తుంది. రక్తపోటును తగ్గించడానికి కూడా సహాయపడుతుంది. క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురించబడిన ఒక అధ్యయనం.. రోజుకు 2 గ్రాముల దాల్చిన చెక్క రెండు నెలల పాటు తీసుకుంటే సిస్టోలిక్ మరియు డయాస్టొలిక్ రక్తపోటును తగ్గిస్తుందని వివరించింది. దాల్చినచెక్క మధుమేహంతోపాటు అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అనేక శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల చికిత్సలో వినియోగించబడుతుంది. ఆర్థరైటిస్‌తో పాటు తలనొప్పి నివారణకు కూడా సహాయపడుతుంది.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215